# గీటురాయి

సహజీవన భావనల పావురాయి

వారపత్రిక 5-4-2024 15/-




## సాధారణ ఎన్నికలకు ముందు అసాధారణ పరిస్థితులు






సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 14 హైదరాబాద్
శుక్రవారం 5 ఏప్రిల్ 2024 రూ.15-00
25 రమజాన్ 1445 హిజ్రీ


**తొలిగీటు**

**ఎవరయితే లైలతుల్ ఖద్ర్ యందు పూర్ణ విశ్వాసంతో పుణ్యఫలాపేక్షతో జాగరణ చేస్తారో వారి వలన జరిగిన పూర్వపు పాపాలన్ని క్షమించివేయబడతాయి.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**





## లోపల...


| | | |
|---|---|---|
| లోక్ సభ ఎన్నికల్లో ప్లాసీ యుద్ధం | ...... | 04 |
| సాధారణ ఎన్నికలకు ముందు అసాధారణ పరిస్థితులు | ...... | 05 |
| విచక్షణా ప్రమాణం-23 | ...... | 08 |
| చరితార్థులు-2 : షేక్ ముహమ్మద్ గులాబ్ | ...... | 12 |
| పాయా... పాయా.... | ...... | 13 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| విరుద్ధ భాగాల పరస్పర సమరసం | ...... | 20 |
| పండుగ (ఈద్) శుభాకాంక్షలు | ...... | 27 |
| మద్యపానం సమాజానికి శాపం | ...... | 28 |
| శిక్షణా మాసం రమజాన్ మాసం | ...... | 30 |
| కేన్సర్‌ను నివారించే రమజాన్ ఉపవాసాలు | ...... | 32 |
| భారతదేశ ముస్లిం సామాజిక, మత సంస్కర్తలు | ...... | 33 |
| షవ్వాల్ మాసంలో మరో ఆరు రోజుల ఉపవాసం | ...... | 34 |


**కడిగిన ముత్యంలా తిరిగొస్తా..**




లిక్కరు స్కాములోన
కలవకుంట్ల కవితమ్మ
తీహార్ చెరసాలలోన
ఆడుద్దట బతుకమ్మ!
ఫెసిలిటీసు బాగుంటై
ఇక అక్కడే ఉండమ్మ
పాడు పాలిటిక్సులోకి
మళ్ళీ నువ్వు రాకమ్మ!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

## ఆలోచన

# లోక్ సభ ఎన్నికల్లో ప్లాసీ యుద్ధం

**భారతదేశంలో** బ్రిటీష్ రాజ్ ప్లాసీయుద్ధంలో సిరాజుద్దౌలా ఓడి పోవడంతో ప్రారంభమయ్యింది. ఈ యుద్ధం 1757లో జరిగింది. ఇప్పుడు ఈ యుద్ధమే బెంగాల్లో లోక్‌సభ ఎన్నికల రణక్షేత్ర మవుతోంది. బెంగాల్లోని కృష్ణనగర్ నియోజకవర్గంలో తృణమూల్ అభ్యర్థి మహువా మొయిత్రాపై బీజేపీ కృష్ణనగర్ రాజవంశానికి చెందిన అమృతరాయ్‌ను నిలబెట్టింది. ప్లాసీ యుద్ధంలో నవాబ్ సిరాజుద్దౌలా ఓటమితో భారతదేశంలో బ్రిటీషువారిని నిరోధించిన చివరి కోట కూడా కూలిపోయింది. ఈ యుద్ధంలో బ్రిటీషు సైన్యాలకు కోల్‌కతాలోని సంపన్న వర్తకులు జగత్ సేఠ్, ఉమిచంద్, నాదియా జిల్లాకు చెందిన కృష్ణనగర్ మహారాజా కృష్ణచందర్ రాయ్‌లు పూర్తి సహకారం అందించారు. నిజానికి కృష్ణచందర్ రాయ్ అంతకు ముందు కేవలం జమిందారు మాత్రమే. నవాబ్ సిరాజుద్దౌలాను ఓడించ డానికి ఆయన అందించిన సహకారంతో సంతోషించిన బ్రిటీషు ప్రభువులు ఆయనకు మహారాజా అన్న బిరుదు ఇచ్చారు.

బీజేపీ ఈ రాజవంశానికి చెందిన అమృతారాయ్‌కు టికెట్ ఇచ్చిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ నేతలు, సమర్థకులు ఈ రాజవంశం బ్రిటీషువారికి ఎలా సహకరించిందో ప్రజలకు చెప్పడం ప్రారంభించారు. బ్రిటీషువారికి సహకరించి బెంగాలుకు ద్రోహం చేసారని నిలదీయడం మొదలయ్యింది. అమృతరాయ్ ఈ విమర్శలకు ఇచ్చిన జవాబు పక్కా బీజేపీ స్టయిల్లోనే ఉంది. నవాబు సిరాజుద్దౌలాకు, బ్రిటీషు వారికి మధ్య జరిగిన యుద్ధంలో కృష్ణచంద్ర బ్రిటీషువారికి మద్దతివ్వకపోతే హిందూ సనాతన ధర్మం నాశనమై పోయి ఉండేదని, సనాతన ధర్మాన్ని రక్షించడానికే కృష్ణచంద్ర బ్రిటీషు వారితో చేతులు కలిపాడని ఆమె చెప్పింది. అప్పట్లో ఆయన అలా చేసి ఉండకపోతే ఈ రోజు ఒక్క హిందువు కూడా మిగిలి ఉండేవాడు కాదని, ఇప్పుడు అందరూ వేరే మతంలోకి మారిపోయి, వేరే భాష మాట్లాడుతూ ఉండే పరిస్థితి ఉండేదని చెప్పారు. ఇది పక్కా బీజేపీ నేతలు మాట్లాడే శైలి. ఒకప్పుడు సుభాష్ చంద్రబోస్ బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడ్డానికి సైన్యాన్ని సమీకరిస్తున్నప్పుడు వినాయక్ దామోదర్ సావర్కర్ బ్రిటీషు వారి కోసం హిందువులను బ్రిటీషు సైన్యంలో రిక్రూట్ చేసేపనిలో బిజిగా గడిపాడు. అప్పటి గొప్ప నాయకులు గాంధీ, నెహ్రూ, పటేల్, బోస్ తదితరులు బ్రిటీషు వారిని వలసశక్తులుగా భావించారు కాని ముస్లిం పాలకులను కాదు. ఎందుకంటే ముగల్ పాలకులు ఈ దేశంలోనే స్థిరపడ్డారు. ఇక్కడి వారయిపోయారు. కాని బ్రిటీషు వారు ఇక్కడి సంపదను తమ దేశానికి దోచుకెళ్ళారు. కాని బీజేపీ నేతలకు హిందూ ముస్లిం చిచ్చు పెట్టడానికి ఇది పనికి రాదు.

బీజేపీ అభ్యర్థిగా నిలబడిన అమృతరాయ్ చెప్పిన మాటల్లో నిజాలున్నాయా? భారతదేశంలో బ్రిటీషు సామ్రాజ్యం పునాదులు పడడానికి కారణాల్లో కృష్ణచందర్ రాయ్ వంటి వారు బ్రిటీషు వారితో చేతులు కలపడం ముఖ్యమైనది. ప్లాసీ యుద్ధం జరిగిన కాలం తర్వాత అప్పటి ఇంగ్లీషు రాతల్లో, పత్రికల్లో కృష్ణచందర్ రాయ్‌ను బ్రిటీషు వారు గొప్పగా పొగిడారు. 19వ శతాబ్దంలో దేశంలో జాతీయతావాదం ఊపందుకున్న తర్వాత కృష్ణచందర్ రాయ్ చేసిన ద్రోహాన్ని విమర్శిస్తూ చాలా మంది రాశారు. సిరాజుద్దౌలా సేనాని మోహన్ లాల్ అప్పటి బ్రిటీషు సైన్యాలను దాదాపు ఓడించినంత పని చేశాడు. కాని కృష్ణచందర్ రాయ్, మీర్ జాఫర్ వంటి వారి కుట్రలు చివరకు సిరాజుద్దౌలా సైన్యాలు ఓడిపోయేలా చేశాయి. అప్పటి కృష్ణచందర్ రాయ్ వంశానికి చెందిన బీజేపీ అభ్యర్థి అమృతా రాయ్ ప్రకారం అప్పట్లో సిరాజుద్దౌలా ఓడిపోడానికి ఆమె పూర్వీకులు బ్రిటీషువారికి సహకారం అందించడం జరక్కపోతే బెంగాల్లో హిందూమతం అంతరించిపోయేది. ఈ మాటల్లో నిజం ఉందా? 1871 నుంచి 1901 వరకు జనాభా గణాంకాలు, అనేక మంది మేధావుల రచనలు చదివితే బెంగాల్లో మతమార్పిళ్ళకు ముఖ్య కారణం కులవివక్ష, నిమ్నకులాలపై అణిచివేతలనే వాస్తవం అర్థమవు తుంది. అలాగే 1757 ప్లాసీయుద్ధం తర్వాత ముస్లిము పాలకుడు అధికారం కోల్పోయి బ్రిటీషు వారు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 140 సంవత్సరాల వరకు మతమార్పిళ్ళు కొన సాగుతూనే వచ్చాయి. అప్పట్లో మతమార్పిళ్ళు చేయించడానికి అధికారబలమూ లేదా ధనబలమూ రెండు కూడా ముస్లిములకు లేవు. అయినా మతమార్పిళ్ళు జరిగాయి. కాబట్టి నవాబ్ సిరాజుద్దౌలా ఓడిపోకపోతే, బ్రిటీషువారు గెలవకపోతే మత మార్పిళ్ళు జరిగిపోయి బెంగాల్లో హిందువులు లేకుండా పోయే వారన్న మాటలో నిజం లేనే లేదన్నది స్పష్టం. ఇక ఆమె చెప్పిన రెండవ మాట బెంగాల్లో ప్రజలు బెంగాలీ మరిచిపోయి వేరే భాష మాట్లాడే పరిస్థితి వచ్చేదన్న ఆరోపణ. బెంగాలుకు సంబం ధించి ఇది అర్థం లేని ఆరోపణ. బెంగాల్లో ముస్లిముల మాతృ భాష బెంగాలీ, ఉర్దూ కాదు. పాకిస్తాన్ నుంచి తూర్పు పాకిస్తాన్ వేరుపడి బంగ్లాదేశ్ ఏర్పడడానికి ముఖ్యమైన కారణం బెంగాలీ ముస్లిముల భాషాభిమానం. అమృతరాయ్ చెప్పిన మాటల్లో వాస్తవాలు లేవు. కాని హిందూ ముస్లిముల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లాభాలు పొందాలన్న మతతత్వ రాజకీయ దుర్వాసన బలంగా ఉంది. ❑

అబ్దుల్ వాహెద్



# సాధారణ ఎన్నికలకు ముందు అసాధారణ పరిస్థితులు

**ఢిల్లీ ముఖ్యమంత్రి** అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. ఈడీ ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేసిన ఈ సంఘటన లోక్‌సభ ఎన్నికల్లో పరిస్థితులు ఎలా ఉండబోతున్నాయో చాటి చెబుతోంది.

ఈ అరెస్టుతో అనేక విషయాలు ముందుకు వచ్చాయి. అందులో మొట్టమొదటిది, ఎన్నికల సమస్యగా ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక విలువలు ప్రచారంలోకి వచ్చాయి. ఇలా జరగడం ఇదే మొదటిసారి. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక విలువలు ఎన్నికల సమస్యలుగా చర్చలోకి రావడం గతంలో ఎన్నడూ జరగలేదు. మోడీ ప్రభుత్వం ఇప్పుడు ప్రజాస్వామ్యానికి తిలోదకాలిచ్చి నిరంకుశ పరిపాలన కొనసాగిస్తోందన్న అభిప్రాయం పలువురిలో బలపడుతోంది. అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుతో రాజకీయంగా చాలా మంది తమ అభిప్రాయాలు మార్చుకునే వాతావరణం ఏర్పడింది. ఇంతవరకు రాజకీయంగా తటస్థంగా ఉన్నామంటూ చెప్పే వాళ్ళు ఇప్పుడు ఉలిక్కిపడ్డారు. రాజకీయంగా తటస్థంగా ఉండడం అనేది వారిని ప్రభుత్వ కక్షసాధింపుల నుంచి రక్షించే కవచమేదీ కాదన్నది చాలా మందికి అర్ధమయ్యింది. స్వయంగా బీజేపీకి మద్దతిచ్చేవారు కూడా ఇప్పుడు ఈడీ చర్యలను బీజేపీ అనుకూల చర్యలుగా, కక్షసాధింపు చర్యలుగా, ప్రతిపక్షాలను బలహీనపరచడానికి కేంద్ర నిఘా సంస్థలను దురుపయోగించే చర్యలుగా చూస్తున్నారు.

ఈ అరెస్టుతో ముందుకు వచ్చిన రెండవ విషయం, ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్రప్రభుత్వంతో ఢీకొనడానికి సమాయత్తమయ్యింది. ప్రతిపక్షాలకు కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలు, ముఖ్యంగా ఈడీ, సిబిఐ, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర నిఘా సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్న తీరు తెన్నులు ఇప్పుడు ప్రతిపక్షాలన్నింటికి మరింత స్పష్టంగా అర్థమవుతున్నాయి. ప్రతిపక్షాలన్నీ ఇప్పుడు ఇండియా కూటమి క్రింద మరింత బలపడే వాతావరణాన్ని ఈ అరెస్టు సృష్టించింది. కేజ్రీవాల్

అరెస్టు అవ్వడం వల్ల ఆప్ పార్టీ కుప్పకూలిపోతుందని చాలా మంది అనుకున్నారు. కాని కేజ్రీవాల్ అరెస్టయినా ఆప్ పార్టీ దృఢంగా నిలబడి బీజేపీ ఆశలపై చన్నీళ్ళు కుమ్మరించింది.

ఈ అరెస్టు వల్ల ముందుకు వచ్చిన మూడో విషయం, ఇప్పుడు ఢిల్లీలోనే కాదు దేశంలో అరవింద్ కేజ్రీవాల్ ప్రముఖ నాయకుడిగా ఎదిగిపోయాడు. ఆప్ పార్టీ ఇప్పుడు జాతీయపార్టీగా ప్రజల్లో గుర్తింపు సంపాదించుకుంది. బీజేపీ పప్పులో కాలేసింది. అరవింద్ కేజ్రీవాల్ బలాన్ని వందరెట్లు పెంచింది.

మోడీ ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాలు రాజకీయంగా ప్రతిపక్షాలను తుడిచిపెట్టేసే నిర్ణయాలని పలువురు విమర్శిస్తున్నారు. ఉదాహరణకు రాజకీయ పార్టీలకు విరాళాల విషయం తీసుకుంటే ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలన్నీ దాదాపుగా తన ఖాతాలో వేసుకుంది బీజేపీ. మరోవైపు కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. ఇంకోవైపు ఆప్ పార్టీ నేతలను జైల్లో పాడేశారు. ఇవన్నీ దేశంలో ప్రతిపక్షం లేకుండా చేసి కేవలం ఒకే పార్టీ రాజకీయాలతో నియంతృత్వం దిశగా దేశాన్ని నడిపే చర్యలని పలువురు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా ఆప్ పై కేంద్రప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల ఆప్ పార్టీ పట్ల ప్రజల్లో సానుభూతి పెరిగింది. మరోవైపు ఈడీ కోర్టులో ప్రతి రోజు వందలాది పేజీల చార్జిషీటులు దాఖలు చేస్తూ బెయిలు దొరకని పరిస్థితిని సృష్టిస్తోంది. ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే అర్థమయ్యేదేమంటే, రాజకీయ నాయకులు వారెంత అవినీతి కూపంలో కూరుకుపోయిన వారైనా సరే బీజేపీలో చేరితే, లేదా బీజేపీతో చేతులు కలిపి మిత్రపక్షంగా మారితే లేదా బీజేపీకి విరాళాలు చెల్లించి అంటే ఒక వసూలు మాఫియాకు చెల్లించిన మాదిరిగా ప్రొటెక్షన్ మనీ చెల్లిస్తే ఎలాంటి సమస్యలు ఇబ్బందులు లేకుండా బతకవచ్చు. లేకపోతే ఈడీ తదితర సంస్థలు కేసులు పెట్టి జైల్లో వేస్తాయి. అజిత్ పవార్, చగన్ భుజ్ బల్, హిమంత బిస్వ శర్మ ఇలాంటి నాయకులపై కేసులు ఏమయ్యాయో కూడా ఇప్పుడు తెలియదు. వారి అవినీతి గురించి ఈడీ పట్టించుకోదు. కేసులు ఉండవు.

కాని కేజ్రీవాల్ అరెస్టయిన కేసులోనే చూడండి, ఈ కేసులో చాలా కీలకమైన వ్యక్తి శరత్ చంద్రరెడ్డి. అతని బెయిలు విషయంలో ఈడీకి ఎలాంటి అభ్యంతరాలు లేవు. ఢిల్లీలో లిక్కర్ లైసెన్సుల కోసం లంచాలు ఇచ్చాడని ఆరోపణలు ఎదుర్కుంటున్న కింగ్ పిన్ నిందితుడని చెప్పబడిన వ్యక్తికి బెయిలు విషయంలో ఈడీకి అభ్యంతరమే లేదు. కాని ఒక ముఖ్యమంత్రి బెయిలు విషయంలో మాత్రం చాలా అభ్యంతరాలుంటాయి. ఈ చంద్రారెడ్డి తానెప్పుడు అస్సలు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను కలవలేదని మొదట్లో చెప్పాడు. తర్వాత అతడిని ఈడీ అరెస్టు చేసింది. అతనికి బెయిలు ఇవ్వకుండా అరెస్టులో కొనసాగించింది. చివరకు అతను కేజ్రీవాల్ పేరును చెప్పాడు. ఈ లోగా ఈ రెడ్డిగారి కంపెనీ దాదాపు 60 కోట్లరూపాయలు బీజేపీకి ఫండ్స్ ఇచ్చింది (ఇది ప్రొటెక్షన్ మనీ అని చెబితే తప్పేమిటి?). ఆ తర్వాత ఈ చంద్రారెడ్డి ప్రాసిక్యూషన్ పక్షాన సాక్ష్యమిచ్చే సాక్షిగా మారిపోయాడు. అతను కేజ్రీవాల్ పేరు చెప్పాడు కాబట్టి కేజ్రీవాల్ నిందితుడైపోయాడు. చంద్రారెడ్డికి బెయిలు దొరికింది. కేజ్రీవాల్‌కు ఇతరులకు బెయిలు దొరకదు. ఈ కేసును పరిశీలిస్తే మనీ ట్రెయిల్ నిందవేస్తున్న వారినే దోషిగా చూపిస్తుంది. అంటే బీజేపీ వద్దకే మనీ ట్రెయిల్ చేరుకుంది. బీజేపీకే కోట్లాది రూపాయలు ఇవ్వడం జరిగింది. డబ్బు ఇచ్చిన వాడు చెప్పిన వాంగ్మూలం ఆధారంగా, అంటే సాక్షిగా మారిన ఒక నిందితుడి వాంగ్మూలం ఆధారంగా, ఆప్ నేతలను అరెస్టు చేయడం జరుగుతుంది. పైగా మని ట్రెయిల్ కు సంబంధించిన ఆధారాలేవీ ఎక్కడా ఎవ్వరు చూపించనే లేదు.

కాని కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం వల్ల, మరీ ఇంత బాహాటంగా ఒకవైపు వసూళ్ళ మాదిరిగా విరాళాలు వసూలు చేయడం, మరోవైపు నిందితుడిని సాక్షిగా మార్చేసి ఒక ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం వంటి చర్యలు ప్రజలు గమనిస్తున్నారని, దీనివల్ల బీజేపీకి తీవ్ర నష్టం తప్పదని స్వయంగా బీజేపీ సమర్థకులే భావించే వాతావరణం ఏర్పడింది. సీ వోటర్ సర్వే ప్రకారం ఎన్డీయే ఓటర్లలో 34.8 శాతం, మొత్తం ఓటర్లలో 52 శాతం ఇదే అనుకుంటున్నారు. కేజ్రీవాల్ అరెస్టు వల్ల ఆప్ పట్ల సానుభూతి పెరుగుతుందని భావిస్తున్నారు.

లోక్‌సభ ఎన్నికలకు నెల రోజుల ముందు ఢిల్లీ ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం అంటే ఎన్నికల్లో ఆప్ పార్టీని అంతం చేసే కుట్రగానే చాలా మంది చూస్తున్నారు. బీజేపీ ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారిందనే అభిప్రాయం అందరిలోను బలపడుతోంది. కేజ్రీవాల్ అరెస్టు తర్వాత ఆప్ పార్టీ కుప్పకూలిపోలేదు. ఆప్ నేతలు బీజేపీని బోనులో నిలబెడుతున్నారు. ఢిల్లీలో చాలా చోట్ల పోలీసులు 144 సెక్షన్ విధించవలసి వచ్చింది. మరోవైపు ఇండియా కూటమి నేతలు ఈ అరెస్టు తర్వాత కూటమిని మరింత బలపరిచే నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీ మోడీని ఉద్దేశించి “భయపడుతున్న నియంత” వంటి పదాలు ఉపయోగించి నిలదీసే వాతావరణం ఏర్పడింది. ఢిల్లీలో కాంగ్రెసుకు, ఆప్ పార్టీకి మధ్య గత పదేళ్ళుగా ఉన్న వైరం ఈ అరెస్టు తర్వాత తుడిచిపెట్టుకు పోయింది. కాంగ్రెసు పార్టీ కేజ్రీవాల్‌కు మద్దతుగా రోడ్డుపైకి వచ్చింది. ఈ మైత్రి

ఢిల్లోలోనే కాదు గోవాలో కూడా కనబడుతోంది. ఇప్పుడు ప్రతి పక్షాలన్నీ ఒక్క గొంతుతో మాట్లాడుతున్నాయి. కేజ్రీవాల్ అరెస్టు మోడీకి సమస్యలు సృష్టించడం ప్రారంభమయ్యింది.

2014లో మోడీ ప్రధానమంత్రి పదవికి అభ్యర్థిగా ముందుకు వచ్చినప్పుడు, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలు గెలుచుకున్నప్పుడు ఢిల్లీలో మోడీకి ఢీకొట్టింది కేజ్రీవాల్ ఒక్కడే. వారణాసిలో మోడీతో పోటీ చేసి 20 శాతం ఓట్లు సాధించి తన సత్తా చాటి చెప్పాడు. 2015లో మరోసారి ఢిల్లీలో బీజేపిని ఎన్నికల్లో మట్టికరిపించాడు. దేశ రాజధానిలో మోడీ మంత్రం పని చేయకపోవడం మోడీ భరించలేని వాస్తవమయ్యింది. ఢిల్లీలో కేజ్రీవాల్ ఒక విద్యావంతుడైన, నిజాయితీపరుడైన, కష్టపడే ముఖ్యమంత్రిగా పేరుపొందడం మోడీ భరించలేని వాస్తవం. కేజ్రీవాల్ అరెస్టు వెనుక ఉన్న కారణమిదే.

ఇక్కడ గమనించవలసిన మరో విషయం కూడా ఉంది. రామ మందిరం, అధికరణ 370, ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు, కోవిడ్ మొదటి అల కాలంలో తబ్లీగీ జమాఅత్‌ను విలన్లుగా చిత్రీకరించడం ఇలాంటి అన్ని సందర్భాల్లోను ఆప్ పార్టీ బీజేపీకి మిత్రపక్షంలా కనబడిన పార్టీ. ఆప్ విధానం, బీజేపీ విధానానికి భిన్నమైనది కానే కాదు. అలాంటి అప్రకటిత మిత్రపక్షం వంటి ఆప్ పార్టీని బీజేపీ పూర్తిగా సర్వనాశనం చేయాలని ఎందుకు పూనుకుంది? మరోవైపు బీజేపీని అనేక విషయాల్లో వ్యతిరేకిస్తున్న మజ్లిస్, వామపక్షాలు, డిఎంకే, ఆర్జెడీ వంటి పార్టీలపై ఇంత తీవ్రమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. కాంగ్రెసు బ్యాంకు ఖాతాలు స్తంభింపజేయడం ఒకవిధంగా తీవ్రమైన చర్యగానే భావించాలి. కాని ఎవరిని అరెస్టు చేయించడం జరగలేదు. ఒక్క చిదంబరాన్ని తప్ప. కాని బీజేపీ ఆప్ విషయంలో తీవ్రమైన నిర్ణయాలు తీసుకుని ఆప్ నేతలను జైలుకు పంపిస్తోంది. కొంతవరకు ఇదే పరిస్థితి బీఆరెస్ పార్టీది కూడాను.

సైద్ధాంతికంగా బీజేపీకి చాలా దగ్గరగా ఉండడం వల్లనే ఆప్ పార్టీ పట్ల బీజేపీ తీవ్రవైఖరి తీసుకుందని అర్థం చేసుకోవాలి. బీజేపీ మాదిరిగా బాహాటంగా ముస్లిం విద్వేష రాజకీయాలు నడపకపోయినా ఆప్ సైద్ధాంతికంగా బీజేపీకి దగ్గరగా ఉన్న పార్టీ. హిందూత్వ ఓటర్లు బీజేపీ పట్ల విసిగిపోతే దగ్గరయ్యేది ఆప్ పార్టీకే. ఈ భయమే బీజేపిని వెంటాడుతోంది. అందులోను దేశరాజధానిలో బీజేపీకి సవాలు విసురుతున్న ఆప్ పార్టీని తొక్కేయకపోతే భవిష్యత్తులో బీజేపీ నేల కరువవుతుందన్నదే బీజేపీ నేతల భయం. మజ్లిస్, డిఎంకే, ఆర్జెడీ, తృణమూల్, వామపక్షాలు ఈ పార్టీలు సైద్ధాంతికంగా బీజేపిని వ్యతిరేకించే పార్టీలు. కాబట్టి కోర్ హిందూత్వ ఓట్లు ఈ పార్టీల వైపు మరలే ప్రమాదం లేదు. అలాగే ఈ పార్టీలు దేశ రాజధానికి దూరంగా ఉన్న పార్టీలు. కాబట్టి ఆప్ వల్ల ఎదురవుతున్న పరిస్థితి ఈ పార్టీల వల్ల లేదు.

కాబట్టి అర్థం చేసుకోవలసిన వాస్తవమేమిటంటే సైద్ధాంతిక సారూప్యత వల్ల నిజానికి ఈ రెండు పార్టీలు దగ్గరయ్యే బదులు, బీజేపీలోని ఈర్ష్య, భయం, అసూయల వల్ల ఈ రెండు పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఇదే పరిస్థితి బీజేపీ శివసేనల మధ్య ఏర్పడిందన్నది కూడా గమనించాలి.

ఏది ఏమైనా ఈసారి జరగబోతున్న లోక్‌సభ ఎన్నికలు భారత రాజకీయాలను ఏ మలుపు తిప్పుతాయో వేచి చూడాలి. ❑


## చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

అధ్యాయం -8

23

# విచక్షణా ప్రమాణం

ఎస్.ఎమ్. మలిక్

## 3. అగ్ర రాజ్యాల పతనం

అబ్లా అనే గ్రామంలో ఈరానీయుల సేనా స్థావరముండేది. అక్కణ్ణుంచి ఇస్లామీయ ప్రాంతాలపైకి దాడులు జరిగే ప్రమాదముండేది. ఖలీఫా ఉమర్ (ర) ఉత్బా బిన్ గజ్వాన్ నాయకత్వాన కొంత సైన్యం పంపారు అక్కడికి. వారు దాన్ని హిజ్రీ 14వ సంవత్సరం గెలుచుకున్నారు. అక్కడే మహనీయ ఉమర్ నేటి బస్రా నగరం స్థాపించారు. అది ఇస్లామీయ సేనా స్థావరంగా రూపొందింది.

కాదిసియాలో రెణ్ణెళ్ళు విశ్రమించిన తరువాత మహనీయ సఅద్, బాబుల్ (బాబిలోనియా)లో ఈరానీ సైన్యం మోహరించినదని తెలుసుకుని ఆయన ఒకే దాడిలో దాన్ని కైవసం చేసుకున్నారు. బాబిలోనియా వాసులు విధేయతకు సమ్మతించారు. ఆ తరువాత సాసానీ(చివరి ఈరానీ)ప్రభుత్వ సేనాని షహరెయార్ వచ్చాడు. మహనీయ సఅద్ ఓ సైనికాధికారుణ్ణి కొందరు సైనికులతో పంపగా అతను షహరెయార్‌ని అంత మొందించాడు. ఈరానీయ సేన పరారయిపోయింది.

## మహాద్భుతం!

ఈరాన్ చక్రవర్తి యజ్దెగర్ద్ (చివరి ఈరాన్ చక్రవర్తి)కి తన ప్రభుత్వ పతనం స్పష్టంగా కానవచ్చింది. అతను శతాబ్దాల తరబడి ప్రోగుజేసిన ఖజానాలు అక్కడి నుండి మరో చోటికి మార్చివేయ ప్రయత్నాలు మొదలెట్టాడు. మహనీయ సఅద్ (ర)కు తెలియగానే ఆయన దాడి చేయాలని సంకల్పించారు. అయితే దారిలోని దజ్లా నది ఆ రోజుల్లో పూర్తిగా వెల్లువెత్తి ప్రవహిస్తోంది. దాట శక్యంగా లేదు. కాని ఆయన,

**"నేను దైవ సహాయాన్ని అర్థిస్తున్నాను, ఆయన పైనే భరోసా పెట్టుకున్నాను, నాకు అల్లాహ్ మటుకే చాలు, ఆయన పరమోత్తమ సంరక్షకుడు"** అనే దుఆ పఠిస్తూ ఉబికి పారుతున్న దజ్లాలో తన గుర్రాన్ని దౌడు తీయించారు. అంతే మిగతా సైనికులు సయితం ఆయన్ని అనుసరించారు. ముస్లిములు దైవం పైన భారం మోపిన తీరును గమనించాలి, పెల్లుబుకుతున్న నదిని కూడా ఖాతరు చేయకుండా గుర్రాలను నదికి అందజేశారు! అల్లాహ్ కూడా దయ తలచి వారిని గట్టెక్కించాడు. నదికి ఆవల ఈరానీయులు ఈ అద్భుతాన్ని చూసి వింతలో మునిగి పోయారు!! ''దేవతలు వచ్చేశారు'' అని కేకలు వేస్తూ పారిపోయారు!!!

మదాయన్ (ఈరానీయుల రాజధాని) వాసులు విధేయతకు

అంగీకరించారు. ముస్లిములు చక్రవర్తి మహలులో రెండు రక'తుల కృతజ్ఞతా నమాజ్ ఆచరించారు. ఆ తరువాత మహనీయ సఅద్ (ర) అక్కడే జుమా నమాజ్ కూడా చేయించారు. అలా ఈరానీయుల మహా సామ్రాజ్యం ముస్లిముల ద్వారా పతనమయి పోయింది.

## రోమనుల వ్యవహారం

హిజ్రీ 13వ సంవత్సరం పాలస్తీనాలోని ఓ చోట ఒక యుద్ధం జరిగింది. అది 'యర్మూక్ పోరాటం'గా ప్రతీతి చెందింది. దాన్ని గురించిన వివరాలు మహనీయ అబూ బక్ర్ (ర) చరిత్రలో ప్రస్తావించడం జరిగింది. ఆ విజయం తరువాత మహనీయ అబూ ఉబైదా (ర) డెమాస్కస్‌ను చుట్టు ముట్టారు. ఈ నగరం మధ్య ప్రాచ్య దేశాల ముఖద్వారంగా పరిగణించ బడుతుంది. దాన్ని కైవసం చేసుకుంటే చుట్టు ప్రక్కల దేశాలను జయించినట్లే. నగర ప్రాకారం చతురస్ర శిలలతో నిర్మించడం జరిగింది. అది 24 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పు ఉండేది. దాని చుట్టూతా 15 అడుగుల లోతు అంతే వెడల్పు కందకం నిత్యం నీటితో నిండి ఉండేది.

మహనీయ ఖాలిద్ బిన్ వలీద్ అయిదు వేల సైన్యంతో తూర్పు ద్వారం వద్ద మకాం వేశారు. రాత్రిళ్లు నిద్ర పోయే వారు కాదు. ఆ నగర విజయం పట్ల ఆలోచనల్లో మునిగి పోయేవారు. ఓ రాత్రి నగర వాసులు ఏదో వేడుక జరుపుకుంటున్నారు. అది గమనించి ఆయన తాను వేసుకున్న పథకం ప్రకారం కందకాన్ని దాటి త్రాటి నిచ్చెన సాయంతో ప్రాకారం ఎక్కేశారు. ఆయన తోపాటు మరికొందరు యోధులు కూడా అలాగే చేశారు. వారు లోనికి దిగి కాపలా ఉన్న సిపాయీలను సునాయాసంగా ఓడించి నగర ప్రవేశ ద్వారాన్ని ధ్వంసం చేసి సైన్యాన్ని లోనికి ప్రవేశింపజేశారు.

అప్పుడు రోమనులు ఎంతో వివేకాన్ని ప్రదర్శించారు. వారు వెంటనే మహనీయ అబూ ఉబైదా ఉన్న ద్వారం వద్దకు వెళ్లి వారితో సంధి ఒప్పందం కుదుర్చుకుని ఇస్లామీయ సైన్యం కొరకు ద్వారం తెరచి వేశారు. ఒక వైపునుంచి మహనీయ ఖాలిద్ విజేతగా ప్రవేశిస్తే మరో వైపు నుంచి అబూ ఉబైదా సంధి ఒడంబడిక చేసుకుని వచ్చారు. ఆయనకు మహనీయ ఖాలిద్(ర) సాధించిన విజయం గురించి తెలియదు. ఆ పైన ఉభయులూ నగర మధ్య లోకి వచ్చినప్పుడు అంతా విశదమయింది. ఇంతకూ హిజ్రీ 14వ సంవత్సరం డెమాస్కస్ నగరం ముస్లిములకు విధేయమయింది.

## ఫహల్ విజయం

ఖలీఫా ఉమర్(ర) కాలంలో జోర్డాన్ పాలస్తీనాలోని ఓ భాగంగా ఉండేది. దాని రాజధాని తబ్రియా (Tibrias) అనే నగరం. తబ్రియాకు తూర్పున ఓ 12 మైళ్ళ పొడవాటి కొలను ఉంది. దాని ఈశాన్య దిశలో ఫహల్ అనే ప్రదేశం ఉండేది. జోర్డాన్‌ని జయించాలంటే ఫహల్‌ని ముందు పొందాలని, ఖలీఫా వద్ద నుంచి సందేశం అందింది అబూ ఉబైదాకు. లోగడ మహనీయ ఉమర్ వ్యాపారం చేసే రోజుల్లో పాలస్తీనా ప్రాంతంలో సైనిక దృష్టితో ప్రాధాన్యత గల ప్రదేశాల్లో ఫహల్ కూడా ఒకటని. మహనీయ అబూ ఉబైదా (ర) తన యోధుల్ని తీసుకుని ఫహల్‌లోనే మకాం వేశారు.

ముస్లిమ్ యోధులు వచ్చేస్తారన్న భయంతో రోమన్ సైనికులు ఆ ప్రాంతంలోని కాలువల కట్టలన్నీ తెంచేశారు. దాని వల్ల ఆ ప్రాంతం అంతా జలమయం అయిపోయింది. ముస్లిములు తమ నైజం రీత్యా ధర్మ మార్గంలో ఎటువంటి ఆటంకాల నయినా ఖాతరు చేయరు, వారు ఆ పరిస్థితిలోనే దాడి చేయాలని నిర్ణయించారు. రోమనుల గూఢాచారులు ఆ విషయం వారికి తెలుపగానే వారు సంధి సంప్రదింపుల కొరకు రాయబారిని పంపమని కోరారు. ముస్లిముల పక్షాన మహనీయ ముఆజ్ బిన్ జబల్ రోమన్ సేనాధిపతి బిడారులోకి వెళ్ళి చూస్తే అక్కడ విలువయిన తివాచీలు పరచి ఉండటం గమనించారు. ఆయన ఓ మూలన దాన్ని మలచివేసి నేల పైన కూర్చున్నారు.

అది చూసి సేనాధిపతి, "మీరు గౌరవనీయులు. తివాచీ పైనే కూర్చోండి"అన్నాడు. ఆయన, "మీ గౌరవానికి ధన్యవాదాలు, కాని నేను బీదవారి హక్కుల్ని కొల్లగొట్టి తయారు చేసిన తివాచీ పైన ఎలా కూర్చోను?" అన్నారు. ఇంకా ఇలా పలికారు, "నేను ముస్లిముల రాయబారిని. మా నియమానుసారం మేము నేరుగా మాటలాడుతాము, సమయం వృథా చేయము. నీవు హృదయ కల్మషం దూరం చేసుకుని నా సందేశం విను, సముచిత సమాధానం ఇవ్వు" అన్నారు. "సరే చెప్పండి"అన్నాడతను.

మహనీయ ముఆజ్ (ర) చెప్ప సాగారు, "దైవ దాస్యం కోరి ఇస్లామ్ స్వీకరించు, దేవుని దాసుల్ని నీ దాసులుగా మార్చుకోబాకు, నీవు ఇలా చేసినట్లయితే మాకు సోదరుడయి పోతావు, ఇంకా నీ హక్కులు ముస్లిముల అధినేత హక్కులకు సమానమవుతాయి. దీనికి సమ్మతించక పోతే మాకు రాజకీయంగా

విధేయుడవయి పోవాలి, జిజియా చెల్లించి. బదులుగా నీకు రక్షణ కల్పించి నీ పరిపాలనను ముట్టుకోము. ఇక ఈ రెండు విషయాలనూ కాదంటే మన మధ్య కరవాలమే నిర్ణయం గైకొంటుంది!''

రోమను అధికారి దానికి, ''మేము సంధి కొరకు జోర్డాన్ ప్రాంతంలోని మీ సరిహద్దులకు ఆనుకుని ఉన్న భూభాగం మొత్తం ఇవ్వగలము, ఇంకా మీ సిపాయీలకు ఒక్కొక్కరికి రెండు సవరాల బంగారం ఇవ్వగలము'' అన్నాడు. ఈ సమాధానం విని మహనీయ ముఆజ్, ''మా వద్ద లంచం చెల్లనేరదు'' అని పలుకుతూ వెనుదిరిగారు.

ఈ వివరాలన్నీ ఖలీఫా ఉమర్ ఫారూక్(ర)కు వేగులను పరిగెత్తించి తెలిపారు. ఆయన వెంటనే ''చెప్పవలసిందేమో చెప్పివేయడం జరిగింది, ఇక ధర్మమార్గంలో ఆటంకాలు సృష్టించే వారితో పోరాటం తప్ప గత్యంతరం లేదు'' అని ఆదేశించారు. అలాగే హిజ్రీ 14వ సంవత్సరం, క్రీ. శ. 635వ సంవత్సరం యుద్ధం జరిగి ముస్లిములు విజయం సాధించారు, ఆ తరువాత మొత్తం జోర్డాన్‌ను సునాయాసంగా కైవసం చేసుకున్నారు.

## 4. బైతుల్ మక్దిస్ హస్తగతం

మహనీయ అబూబక్ర్ సిద్దీక్(ర) చరిత్రలో ప్రస్తావించడం జరిగింది, హిజ్రీ 12వ సంవత్సరం పాలస్తీనా వైపునకు ఆయన మహనీయ అమ్ర్ బిన్ ఆస్ (ర)ని పంపించారని. అయితే కొన్ని కారణాల వల్ల ఆ ప్రయత్నం అసంపూర్ణంగా వదలిపెట్టవలసి వచ్చింది. అక్కడ పెద్ద ఎత్తున సైన్యం మోహరించారు రోమనులు. ఇప్పుడు హిజ్రీ 15వ సంవత్సరం మహనీయ ఉమర్ (ర), ఆ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అమ్ర్ బిన్ ఆస్‌ని ఆదేశించారు.

ఆ సందర్భంలో రాజధానిలో కొందరు సహచర మాన్యులు, ''అక్కడ రోమను సేనాని 'అర్తబూన్' అనే ఓ మహా వంచనా శిల్పి ఉన్నాడు'' అని హెచ్చరించారు. మహనీయ ఉమర్ దరహాసంతో, 'రోమను అర్తబూన్‌కు పోటీగా మన అరబ్బు అర్తబూన్ నిలుస్తాడు, చూద్దాము ఎవరు గెలుస్తారో!' అన్నారు. మహనీయ అమ్ర్ కూడా యుద్ధ విద్యలో, ఎత్తుకు పైఎత్తులు వేయడంలో ఆరితేరిన వారు.

మహనీయ అమ్ర్ బిన్ ఆస్(ర) అకస్మాత్తుగా దాడి జరిపారు. రోమను సైనికులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ ఈ దాడికి తట్టుకోలేక పోయారు, వెనుదిరిగి నగర ప్రాకార ద్వారంలోకి వెళ్ళి ద్వారం మూసుకున్నారు. కొన్నాళ్ల పాటు రాయబారాలు జరిగాయి. ఫలితం లేకపోవడంతో ఓ రోజు స్వయంగా మహనీయ అమ్ర్ రాయబారిగా రూపొంది అర్తబూన్ వద్దకు చేరుకున్నారు. మాటల సందర్భంలో అతను గ్రహించాడు, ఈయనే అమ్ర్ బిన్ ఆస్ అని.

అతను రోమను భాషలో ఓ సిపాయీని మెల్లిగా ఆదేశించాడు, 'ఇతను ద్వారం వద్దకు వెళ్ళే వరకు ఇతన్ని చంపివేయాల'ని! మహనీయ అమ్ర్ అది పసిగట్టారు. ఆయన చాకచక్యంగా, ''నీవు సంధి కోసం ప్రవేశ పెట్టిన అంశాలు గమనార్హమయినవి. అయితే నాతో పాటు ఇంకా తొమ్మండుగురు ఉన్నారు, వారితోనూ సంప్రతించవలసి ఉంటుంది. అందువల్ల రేపు మేమందరం వచ్చినప్పుడు సంధి షరతులు నిర్ణయించుకుందాము'' అన్నారు.

అర్తబూన్ అనుకున్నాడు, రేపయితే ఇంకా మంచి అవకాశం ఉంటుందని, ఆ ప్రతిపాదనను అంగీకరించాడు. మహనీయ అమ్ర్ సురక్షితంగా బయటపడ్డారు. మరుసటి రోజు అర్తబూన్ జరిగింది గ్రహించి తన అవివేకానికి తల బాదుకుని ఉంటాడు. కొన్నాళ్ల తరువాత మహనీయ అమ్ర్ అత్యంత తీవ్రంగా దాడి జరిపారు, రోమను సైనికులు రంగం వదలి పాలస్తీనా వైపునకు పారిపోయారు. అక్కడి సైనిక స్థావరాలు ముస్లిమ్ యోధుల స్వాధీనమయ్యాయి. ఇంకా రోమనులూ సిరియనులు వదలిపోయిన అపారమయిన వస్తు సామగ్రి ముస్లిముల చేజిక్కింది.

### ముందడుగు

రోమను సేన బైతుల్ మక్దిస్‌కి పారిపోయిన తరువాత మహనీయ అమ్ర్ వారిని వెంబడించకుండా ఆ చుట్టుపక్కల ప్రాంతాల పట్ల దృష్టి సారించారు. కొన్ని బెటాలియన్‌లను భిన్న కమాండర్ల ఆధ్వర్యంలో భిన్న నగరాలకు పంపారు. కొన్నాళ్ల లోపే గజ్జా, నాబ్లస్, జిబ్రీన్, యాఫా, లుద్ద్, ఇమ్వాస్ తదితర నగరాలను కైవసం చేసుకుని వారంతా తిరిగి వచ్చేశారు. ఆ తరువాత ముస్లిమ్ యోధులు బైతుల్ మక్దిస్ వైపునకు ముందడుగు వేశారు.

రోమనులు ఎంత అధికసంఖ్యలో ఉన్నా ముస్లిములను మార్కొనడం వారి వల్ల కానిపనిగా పరిణమించింది. అర్తబూన్ తన సేనతో బైతుల్ మక్దిస్‌లోకి వెళ్ళి కూర్చోవడం తప్ప గత్యం

తరం లేకపోయింది. మహనీయ అమ్ర్ నగరాన్ని చుట్టుముట్టారు. నగరంలో నిత్యావసర వస్తువులు నిండుకు వచ్చాయి. కడకు అర్తబూన్, 'మేము సంధికి ఒప్పుకుంటున్నామని, అయితే ముస్లిముల ఖలీఫా వచ్చి ఒడంబడిక చేయవలసి ఉంటుంద'ని సందేశం పంపాడు. ఈ సమాచారం రాజధానిలో ఖలీఫాకు అందజేయడం జరిగింది.

ఖలీఫా ఉమర్ మదీనా నుండి బయలు దేరారు. ఇస్లామీయ సిద్ధాంతాలు, సంప్రదాయాలు ఆయన కన్నా బాగా యెరిగిన వారెవరుంటారు. ఆయన, ప్రపంచంలోని పటాటోపం, కృత్రిమ ఠీవి, అనవసర వైభవాడంబరాలను కాదని ఇస్లామ్ ప్రాముఖ్యత, దాని తేజం, ఔన్నత్యం, మహత్తులు ఉట్టిపడే నిరాడంబరతతో, సర్వ సామాన్య దుస్తులు ధరించి, నాడెములు అరుక్కు పోయి కుంటుకుంటూ నడిచే ఓ సాధారణ గుర్ర మెక్కి, ముందూ వెనకాల మందీ మార్బలం లేకుండా, కేవలం ఒక నౌకరు, కొందరు సహచరులు వెంట రాగా బయలుదేరారు ఆయన. ఇదీ క్రీ. శ. ఏడవ శతాబ్దిలో, దాదాపు ఇరవై మూడు లక్షల చదరపు మైళ్ళ వైశాల్యం గల రాజ్యం, ఆరేడు దేశాల అధినేత పాలకుని తీరు, లొంగిపోయిన దేశానికి ఆయన పయన విధానం!

విభిన్న ప్రదేశాల్లో ఉన్న సైనికాధికారులకు జాబియాలో వచ్చి కలవాలని నిర్దేశించడం జరిగింది. అలాగే యజీద్ బిన్ అబూ సుఫ్యాన్, అబూ ఉబైదా, ఖాలిద్ బిన్ వలీద్, (రజియల్లాహు అన్హుమ్) వచ్చి ఆయనకు స్వాగతం పలికారు. ఆ సందర్భంలో కొందరు ముస్లిములు పట్టు వస్త్రాలు ధరించి కనిపించారు. అది ఆయనకు ఆగ్రహం కలిగించింది. అయితే వెంటనే ఆ వ్యక్తులు, "అమీరుల్ మూ'మినీన్! మా శరీరం పైన సతతం కవచాలు, ఉక్కు వస్త్రాలు మూసుకునే ఉంటాయి. ఇవి కాస్త ఎడతెరిపిగా ఉంటాయని ధరించాము" అని వేడుకున్నారు. ఆయన అప్పుడు శాంతించారు.

జాబియాలోనే బైతుల్ మక్దిస్ అధికారి ఒకరు బృందంతో రాగా అక్కడే వారితో ఒడంబడిక జరిగింది. ఆ తరువాత ఆయన బైతుల్ మక్దిస్ వైపునకు వెళ్ళారు. ఆయన గుర్రం మరింత కుంటుకో సాగింది. ఆయన దిగి నడక సాగించారు. ఇంతలో జనులు తుర్కీ జాతి, నాణ్యమైన గుర్రం తీసుకు వచ్చారు. అది ఆయన ఎక్కగానే గంతులు వేయ సాగింది. ఆయన దిగి కాలినడకనే నగరానికి చేరుకున్నారు. అప్పుడు ముస్లిమ్ అధికారులు ఆయన వస్త్రాలు బాగా లేవని, స్వాగతానికి వచ్చే క్రైస్తవ నాయకులు ఏమను కుంటారో అనుకుని, భయపడుతూనే మంచి వస్త్రాలు సమర్పిం చారు. ఆయన, "దైవం మనకు అనుగ్రహించిన గౌరవం ఇస్లామ్, అదే మనకు చాలు" అని పలికారు. ■


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.


బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

'చరితార్థులు'-2



# షేక్ ముహమ్మద్ గులాబ్

## (1858-1920)

40




**భారతదేశంలో** మహాత్మాగాంధీ నిర్వహించిన తొట్టతొలి సత్యాగ్రహోద్యమానికి భూమికగా నిలచిన చంపారన్ రైతాంగ పోరాట యోధులు షేక్ ముహమ్మద్ గులాబ్. ఆయన బీహార్ రాష్ట్రం చంపారన్ ప్రాంతంలోని లోహియా రాణా, చాంద్ బార్వాహ్ గ్రామంలోని సాధారణ రైతు కుటుంబంలో 1858లో జన్మించారు. చిన్నతనం నుండి స్వేచ్ఛా-స్వతంత్ర భావనలు కలిగిన ఆయన స్వయంగా రైతు. ఇండిగో ఉత్పత్తికి చంపారన్‌ను అనుకూలమైన ప్రదేశంగా ఎంచుకున్న ఆంగ్లేయ ప్లాంటర్లు ఇక్కడ స్థిర నివాసాలు, కర్మాగారాలు నిర్మించుకున్నారు. ఆ కర్మాగారాలకు అవసరమగు ముడి పదార్థాల పంటలను మాత్రమే పండించాల్సిందిగా రైతులకు హుకుం జారీ చేయసాగారు. ఈ ఆదేశాలను నిరసించిన రైతులకు ప్లాంటర్లు, ప్రభుత్వం, పోలీసుల నుండి కడగండ్లు ఆరంభమయ్యాయి. ఆ సమయంలో షేక్ ముహమ్మద్ గులాబ్ చంపారన్ రైతుల సహజసిద్ధ హక్కుల పరిరక్షణకు నడుం కట్టి రైతులను సంఘటితపర్చి, 1905లో సమర శంఖారావం పూరించారు. ఇండిగో ప్లాంటర్ల దుశ్చర్యలను వివరిస్తూ తమకు న్యాయం చేకూర్చమని ప్రాంతీయ, జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు పలు మహజర్లు సమర్పించినా సానుకూల ఫలితం లేకుండటంతో రైతులు ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకున్నారు. ఆ కారణంగా షేక్ గులాబ్‌తో పాటు 162 మంది రైతులను నిర్బంధించి పలు ఇక్కట్లకు గురిచేసింది ఆంగ్ల ప్రభుత్వం. ఆ చర్యలకు నిరసనగా షేక్ గులాబ్ నేతృత్వంలో పంట సాగు బహిష్కరణ, ప్రదర్శనలు, ఊరేగింపులతో రైతులు ఉద్యమించారు. ఆంగ్లేయుల నుండి వచ్చిన ఆర్థిక సదుపాయం, ఉద్యోగాల కల్పన లాంటి తాయిలాలు రైతుల తిరస్కారానికి గురయ్యాయి. చివరకు రైతుల మీద, నాయకుల మీద లెక్క లేనన్ని కేసులు నమోదయ్యాయి. ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్న ఆయన ప్లాంటర్ల దుర్మార్గాలను, రైతుల కడగండ్లను పూసగుచ్చినట్టుగా న్యాయస్థానంలో వివరించారు. ఆ విషయాలన్నిటిని మౌల్వీ పీర్ మొహమ్మద్ మునిస్ అనే జర్నలిస్టు కాన్పూర్, ఢిల్లీ నుండి వెలువడుతున్న పలు పత్రికల ద్వారా పదిమంది దృష్టికి తెచ్చారు. ఆ కారణంగా 1916లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ జాతీయ సమావేశాల్లో చంపారన్ రైతుల సమస్య చర్చకు వచ్చింది. 1917 ఏప్రిల్ 10న చంపారన్ రైతుల వినతి మేరకు చంపారన్ వచ్చిన మహాత్మా గాంధీ 'చంపారన్ రైతాంగ సత్యాగ్రహం' ఆరంభించారు. ఈ మేరకు దక్షిణాఫ్రికా తరువాత భారతదేశంలో తొలిసారిగా గాంధీజీ ఆరంభించిన సత్యాగ్రహ ఉద్యమం విజయవంతమయ్యి భారత స్వాతంత్ర్యోద్యమంలో నూతన పోరాట రూపానికి నాంది పలికింది. ఈ చారిత్రాత్మక చంపారన్ రైతాంగ సత్యాగ్రహ ఉద్యమానికి వెన్నెముకగా నిలచి, తద్వారా మహాత్మా గాంధీ, వల్లభ్‌భాయ్ పటేల్, బాబూ రాజేంద్ర ప్రసాద్ లాంటి అగ్రనేతలతో ఆయనకు మంచి సహచర్యం ఏర్పడినప్పటికి చరమ జీవితాన్ని సాధారణ రైతుగా గడిపిన షేక్ ముహమ్మద్ గులాబ్ 1920లో కన్నుమూశారు. ❑



**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2** (తెలుగు) THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




## తెల్లవారుజాము నాలుగయ్యింది

కంయ్...య్....య్....

ఆ సౌండు మరేం కాదు... సైరను సౌండు... రమజాను మాసం కదా ... పొద్దున్నే సహరీకి లేవాలి కదా...

సైరన్ కూతకు సిరాజ్ గాడు ఉలిక్కిపడి లేచాడు.. రాత్రి నిద్ర పోయేసరికి రెండున్నరైంది. పూర్తిగా రెండు గంటలు కూడా నిద్ర పోలేదు. నిద్ర చాలేలా లేదు... పగలంతా కాస్త కష్టమే.

పక్కన చూస్తే గఫార్ గాడు ముసుగుతన్ని గుర్రుపెడుతున్నాడు...

ఎడం కాలితో వాడి డొక్కలో ఒక్క తన్ను తన్నాడు సిరాజ్.

క్యా హువా రే... వాడు విసుక్కుని మరోవైపు తిరిగి పడుకున్నాడు...

మొత్తానికి ఓ నాలుగు తాపుల తర్వాత కాని గఫార్ గాడు లేవలేదు. లేచాక ఒళ్ళు విరుచుకోవడం, ఆవలించడం వగైరా కార్యక్రమాలన్నీ ముగించి...

టైమెంతరా.. అన్నాడు.

నాలుగు... టైము లేదు పద పద త్వరగా ముఖం కడుక్కుని చావు అన్నాడు సిరాజ్.

మే నెల.. మండువేసవిలో వచ్చింది రా బాబు రమజాన్ అని గొణుక్కుంటూ లేచాడు గఫార్.

మే నెల కాబట్టి సహరీ టైము త్వరగా అయిపోతుంది...

బ్రష్షు నోట్లో పెట్టుకుని గఫార్ గాడు... ఏం తిందాం అన్నాడు.

రాత్రి పెరుగుంది... పెరుగన్నం కాస్త తినేద్దాం... అదే చాలు అన్నాడు సిరాజ్.

ఏడ్చావ్... పెరుగన్నమా... నయాగరాకు పోదాం... పాయా తిందాం అన్నాడు గఫార్

ఎండాకాలం ఉపవాసాలు రా బాబు, మసాలాలు తింటే బతుకు మసాలా అయిపోతుంది.. సిరాజ్ గాడి భయాలు వాడికి.

మరేం ఫర్వాలేదులేరా... పద నయాగరా పోదాం...

ఇద్దరూ బ్యాచిలర్సే... రూమ్మేట్స్. పెళ్ళి పెటాకులు లేవు. ఉద్యోగాలు దొరికాయి కాబట్టి డబ్బుకు కూడా పెద్ద ఇబ్బంది లేదు. రూముకు దగ్గరలోనే హొటలు. రూము తాళం వేసి రోడ్డున పడ్డారు.

రమజాన్ వాతావరణం ఓల్డ్ సిటీలోనే చూడాలి. పొద్దుట రెండు, మూడు గంటల నుంచే జన సంచారం మొదలైపోతుంది. హొటళ్ళు తెరిచేస్తారు. కొన్ని హొటళ్ళ ముందు సహరీ మీల్స్ అని బోర్డులు కూడా కనబడతాయి. సహరీ మీల్స్ అంటే అదేదో కొత్త డిష్షు కాదు. ఉపవాసాలకు పొద్దుటే, అంటే సూర్యోదయానికి ముందే భోం చేయడాన్ని సహరీ అంటారు. కొన్ని హొటల్సు ఉచితంగా కూడా సహరీ మీల్స్ ఏర్పాటు చేస్తాయి.

నయాగరా చాలా పాత హొటలు. సందడి సందడిగా ఉంది.

సహరీ కోసం వచ్చినవాళ్ళు బయట కూడా కూర్చుని తింటున్నారు. ఖాళీగా ఉన్న టేబుల్ వెదుక్కుని ఇద్దరూ కూలబడ్డారు.

వెయిటర్లతో తీరిగ్గా మాట్లాడేంత సమయం లేదు. వెయిటర్ కూడా తీరిగ్గా నిలబడి ఆర్డరు తీసుకోడు. టైమైపోతోంది, కాబట్టి త్వరగా చెప్పకపోతే మరో టేబుల్ దగ్గరకు వెళ్ళిపోతాడు. వెయిటర్ రాగానే ... దో పాయా షీర్మాల్ అన్నాడు గఫార్

షీర్మాల్ అంటే నాన్ రొట్టె. నలుచదరంగా ఉంటుంది. మైదా పిండితో చేస్తారు. చాలా హెవీ డైట్. దాంతోపాటు పాయా.. పాయా అంటే గొర్రె కాళ్ళతో చేసిన సూప్. మసాలాలు ఫుల్లుగా ఉంటాయి. గఫార్ గాడిచ్చిన ఆర్డర్ సిరాజ్ గాడికేం నచ్చలేదు. కాని వాడు విని చావడు.

వెయిటర్ సుడిగాలిలా తిరుగుతున్నాడు. ఆర్డర్ ఇచ్చిన అరక్షణంలో రెండు బౌల్స్ తెచ్చి ముందు పడేశాడు. అందులో సూప్, సూప్ లోపల పాయా ఉంటుంది. షీర్మాల్ రొట్టెలు నాలుగు తెచ్చి ఒక ప్లేటులో పెట్టాడు. ఆ రొట్టె చిన్న చిన్న ముక్కలు చేసి సూప్‌లో నానడానికి వేసి తింటారు. సూప్‌లోనే మేక కాళ్ళు ఉంటాయి. వాటిని ప్లేటులో పెట్టుకుని నంజుకోవడం. వేడివేడిగా ఉంది సూప్. పాయా ముట్టుకుంటే కాలుతుంది. కాని టైమైపోతోంది.... కాబట్టి గబగబా తినేయాలి. లేకపోతే ఆకలితో రోజంతా అఘోరించాల్సి వస్తుంది.

కానియ్.. కానియ్.. అంటూ గఫార్ గాడు తినడం మొదలెట్టాడు. ఒక వాటర్ బాటిల్ తెచ్చుకుందాం... ఈ నీళ్ళు బాగున్నట్లు లేవు... పైగా కూల్ వాటర్ పెట్టాడు. ఇంత చన్నీరు తాగితే తర్వాత దాహంతో చస్తాం అన్నాడు సిరాజ్.

నీళ్ళు రూముకు పోయి తాగుదాం లేరా.. ముందు తిను అన్నాడు గఫార్.

మొత్తానికి పాయా విత్ షీర్మాల్ తినడం పూర్తి చేసి, చేతులు కడుక్కుని లేచారు. నీళ్ళు తాగలేదు. గఫార్ గాడు టైము చూసు కున్నాడు. ఇంకా పావుగంట ఉందిరా పర్వాలేదు అన్నాడు.

సిరాజ్ గాడికి నిద్రొస్తుంది.... గఫార్ గాడు సిగరెట్లు రెండు తెచ్చాడు.

ఓ రెండు తగలేస్తే ఒక పనైపోతుందిరా.. ఎలాగూ టైముంది కదా... కానీ... మళ్ళీ సాయంత్రం ఏడు దాటే వరకు చాన్సుండదు అన్నాడు.

అవున్నిజమే అనుకుంటూ సిరాజ్ సిగరెట్ అందుకున్నాడు. సిగరెట్టు దమ్ము లాగుతూ ఇద్దరు పిచ్చాపాటిలో పడ్డారు. టైము మరిచి పోయారు. సహరీ టైము అయిపోయినట్లు సూచించే చివరి సైరన్ మోగింది. సిగరెట్ తగలేయడం కూడా పూర్తయ్యింది. కాసేపటికే అజాన్ వినిపించింది. అజాన్ వినిపించ గానే మస్జిదుకు వెళ్ళి పోయారు. నమాజు పూర్తయిన తర్వాత గుర్తొచ్చింది ఇద్దరికీ తాము అస్సలు ఒక్క చుక్క నీరు కూడా తాగలేదని.

చచ్చాం అనుకున్నారు.

సాధారణంగా సహరీ తినగానే ఎందుకైనా మంచిదని ఓ ఐదారు గ్లాసుల నీళ్ళు తాగేస్తాడు సిరాజ్ గాడు. సాయంత్రం వరకు దాహం తట్టుకోవాలన్నది వాడి ప్లాను. నమాజు తర్వాత కాసేపు నిద్ర పోదామనుకుంటాడు. కాని తాగిన ఐదారుగ్లాసుల నీరు లోపల ఉండలేను అని గోల మొదలెడుతుంది. చచ్చినట్లు అరగంటలో మళ్ళీ లేచి బాత్రూముకు వెళ్ళడం తప్పదు. అయినా ఐదారు గ్లాసుల నీళ్ళు తాగడం మానడు. ఆ రోజు నీళ్ళ కోటా పూర్తి చేశాననే తృప్తి.

కాని ఇప్పుడు చుక్క నీరు తాగలేదు. ముఖం దిగాలుగా వేసుకుని.. ఎలారా అన్నాడు.

గఫార్ గాడు నవ్వుతూ.. ఏమవుతుందిరా... సాయంత్రం ద్రమ్ము నీరు తాగు .. మరేం ఫర్వాలేదు పద అన్నాడు. ఇద్దరు రూముకొచ్చి కాసేపు నిద్రపోదామని పడకేశారు. రాత్రి నిద్రలేదేమో వెంటనే గుర్రుపెట్టారు. లేచేసరికి ఎనిమిదయ్యింది. పొద్దున్నే తిని పడుకుంటే లేచేసరికి మామూలుగానే కాస్త దాహం అనిపిస్తుంది. ఇప్పుడు అస్సలు నీరు తాగలేదేమో దాహంతో నాలుక పిడచకట్టినట్లుంది.

ఏంట్రా ఎనిమిది కూడా కాలేదు, అప్పుడే దాహమేస్తోంది. ఇక రోజంతా ఎలా అన్నాడు సిరాజ్ కాస్త దిగాలుగా... ఫర్వాలేదులేరా... లేవంగానే దాహమనిపిస్తుంది మామూలేగా.. కాసేపటికి తగ్గి పోతుంది.. పద.. పద ఆఫీసుకు పోదాం అన్నాడు గఫార్. అన్నాడు కాని గఫార్‌కి కూడా దాహం దెబ్బ ఈ రోజు గట్టిగానే ఉంటుంద నిపించింది.



ఆఫీసుకు వెళ్ళారు... పనుల్లో పడ్డారు కాని దాహం తగ్గలేదు. మసాలాలు దట్టించిన పాయా సూప్, దానికి తోడు ఆ నాన్ రొట్టె... అంతటితో ఆగారా అంటే అదీ లేదు.. పోయి సిగరెట్టు తగలేశారు. పైగా నీరు తాగలేదు. దాహం కాస్త తీవ్రంగానే ఉంది. దాహాన్ని మరిచిపోయే ప్రయత్నం చేస్తూ పనిలో పడాలనుకున్నారు. నీరసంగా కూడా అనిపిస్తోంది. ఇక లాభం లేదనుకుని మధ్యాహ్నం నుంచి సెలవు పెట్టేసి రూముకెళ్లిపోవాలని డిసైడ్ చేసుకున్నారు.

కాని బాస్ మరో ఫిటింగ్ పెట్టాడు. అర్జంటుగా బాలనగర్ వెళ్ళి రమ్మన్నాడు. ఆ తర్వాత ఇంటికి పొండన్నాడు. బాలనగర్ వెళ్ళాలంటే ఈ ఎండలో.. సరే తప్పుతుందా.. మధ్యాహ్నం రావద్దన్నాడు కదా అటు నుంచి రూముకెళ్ళిపోదాం అనుకున్నారు. బస్సులో వెళితే లేటవుతుంది, కాబట్టి రాజుగాడి డొక్కు స్కూటరు అడిగి తీసుకున్నారు. మే నెల సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. డొక్కు స్కూటరుపై బాలనగర్ వెళ్ళి పనులు చూసుకుని తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం ఒంటిగంటైంది. ఎండ దంచేస్తోంది. గఫార్ గాడు తిన్నగా స్కూటరు తమ రూము ముందున్న ఖాజా సారు ఇంటి ముందు ఆపి తలుపు తట్టాడు. ఖాజాగారమ్మాయి ఎనిమిదో తరగతి చదివే నాజియా తలుపుతీసింది. ఆ అమ్మాయికి గఫార్ గాడు ట్యూషన్ చెబుతుంటాడు. ఆ అమ్మాయి రాగానే "ఫ్రిజు లోంచి రెండు వాటర్ బాటిల్స్ పట్రా" అని ఆర్డరేశాడు.

నాజియా ఒకసారి ఇద్దరిని, స్కూటరును చూసింది...

గఫార్ గాడు చికాగ్గా... "త్వరగా పట్రా" అన్నాడు.

ఆ అమ్మాయి ఏమనుకుందో మాట్లాడకుండా లోపలికెళ్లి వాటర్ బాటిల్ రెండు గ్లాసులు తీసుకుని వచ్చింది. ఆ అమ్మాయి గ్లాసులో నీరు పోయకముందే గఫార్ గాడు బాటిల్ లాక్కున్నాడు. "ఇలాగే తాగేస్తాలే" అంటూ మూత విప్పి బాటిల్ పైకెత్తి... అలాగే ఆగిపోయాడు...

నాజియా నవ్వుతోంది...

సిరాజ్ గాడికి కూడా అప్పుడు గుర్తొచ్చింది... తాను ఉపవాసం ఉన్నానని. ఎండ దెబ్బకు నీరు తప్ప మరేమీ గుర్తురాలా అప్పటి వరకు...

గఫార్ గాడు నెమ్మదిగా బాటిల్ కిందికి దించేశాడు. మూత టైట్ చేస్తుంటే నాజియా కిసుక్కున నవ్వింది. గఫార్ గాడికి ఒళ్ళు మండుకొచ్చింది."ఎందుకు నవ్వుతున్నావే"అన్నాడు కోపంగా

"చాచా.. భూల్ గయే క్యా" అంది నవ్వుతూ...

పుండు మీద కారం రాసినట్లు మరో డైలాగు కొట్టింది.

"ప్చ్... ఒక్క నిముషం ఆలస్యంగా గుర్తొస్తే బాగుండు.. కిస్మత్ కీ బాత్" అని కూడా చెప్పింది.

గఫార్ గాడికి ముఖం కందగడ్డలా తయారైంది. కాని ఆ అమ్మాయి చెప్పిన మాట నిజమే. తాను మరిచిపోయాడు. ఒక్క నిముషం ఆలస్యంగా గుర్తొచ్చినట్లయితే నిజంగానే వ్రతం చెడేది కాదు. రెండు గుక్కలు నోట్లో పోయేవి. ప్చ్ .. ఏం లాభం...

వెనక కూర్చున్న సిరాజ్ గాడికి శోష వచ్చేలా ఉంది.

"ఉరేయ్.. ఇంకా ఈ ఎండలోనే తగలడదామా.. రూముకి పోదామా" అన్నాడు.

రూముకి పోయి ఏం చేస్తాం.. ఉక్కబోసి చస్తాం.. నమాజు టైమైంది.. పద మస్జిదుకు పోదాం. బండి అక్కడే పారేద్దాం. రాజుగాడు వచ్చి తీసుకెళ్తాడ్లే.. మస్జిదులో కూలర్లుంటాయి. నమాజు తర్వాత ఏదన్నా కూలరు దగ్గర సెటిలైపోదాం అన్నాడు గఫార్.

ఉస్సూరుమంటూ ఇద్దరు మస్జిదు వైపు కదిలారు. మస్జిదు బయటే స్కూటరు పారేసి, లోపలికి వెళ్ళి వుజు చేసుకున్నారు. చల్లని నీళ్ళతో వుజు చేస్తుంటే ప్రాణం లేచి వచ్చినట్లుంది. పుక్కిలిస్తున్నప్పుడు నీరు నాలిక్కి తగిలితే మింగేయాలన్నంత యావ... కాని మింగలేరు. సిరాజ్ గాడు చొక్కా విప్పి నీళ్ళల్లో తడిపేసి మళ్ళీ తొడుక్కున్నాడు. కాస్త చల్లగా ఉంటుందని. అలాగైనా దాహం తగ్గుతుందని ఆశ.

వుజు తర్వాత ముఖం తుడుచుకోలేదు. నీళ్ళు అలాగే ముఖంపై చల్లగా వదిలేశారు.

నమాజు పూర్తయింది. మస్జిదులో చాలా మందే ఉన్నారు. కూలరు దగ్గర కాస్త చోటు చూసుకుని ఇద్దరు చతికిలబడ్డారు. కాసేపటికే ప్రాణం ఎటు పోయిందో తెలియదు. మత్తయిన నిద్ర.

నిద్రలో...

సిరాజ్ గాడు కూలుడ్రింకులు ఎన్ని తాగేశాడో తెలియదు. షాపులో వాడు ఇంకా లేవు అయిపోయాయన్నాడు. సిరాజ్ గాడు వాడితో గొడవ పెట్టుకున్నాడు. తెప్పించి ఇవ్వు. షాపెందుకు పెట్టావురా... బుద్ధిలేదా అడ్డగాడిద అని తిట్టేస్తున్నాడు.

గఫార్ గాడి చేతిలో కూల్ కూల్ వాటర్ బాటిలు. ఎంత తాగినా అందులో నీళ్ళు అవ్వడం లేదు... ఇదేదో అక్షయపాత్రలాంటి బాటిల్ అని హ్యాపీగా తాగేస్తున్నాడు. ఇంతలో ఎవడో బాటిల్ లాగేసుకున్నాడు. వాడితో గొడవ.. నా బాటిల్ తీసుకుంటావా.. చంపేస్తా.. ఇవ్వు..

ఇద్దర్ని ఎవరో పట్టుకుని కుదిపి లేపారు....

లేచిన తర్వాత అసలెక్కడున్నది కాసేపు ఇద్దరికీ అర్థం కాలేదు. పక్కనున్న గెడ్డం ముసలాయన నవ్వుకుంటూ.. దాహమేస్తుందా అన్నాడు.

అంటే.. కలలో నీటియుద్ధం పలవరించినట్లు ఇద్దరికీ అర్థమైంది. నవ్వుతూ తలూపారు... వుజు చేసుకుని నిద్రపోండి... సాయంత్రం కావలసినన్నీ నీళ్ళు తాగొచ్చు అన్నాడా మౌల్వీ.

అంతకన్నా చేసేదేముందిలే అనుకుంటూ గఫార్ లేచాడు మరోసారి వుజు చేసుకోడానికి.

టైము చూసుకుంటే ఇంకా మూడే అయ్యింది. బాబోయ్... ఇంకా నాలుగ్గంటలాగాలి...

గట్టిగా నిట్టూర్చాడు

పక్కన సిరాజ్ గాడు కోపంగా చూస్తున్నాడు.

ఏంట్రా అలా చూస్తున్నావ్ అన్నాడు.

నేను చెప్పానా... పెరుగన్నం తినేసి పడుకుందాంరా అన్నా ... విన్నావా.. అబ్బే పాయా... షీర్మాల్... నహారీ... ఆ తర్వాత సిగరెట్టు.. నా బొంద.. ఇప్పుడు చూడు అన్నాడు.

సర్లేరా... ఏడవకు.. సాయంత్రం పెద్ద కోక్ బాటిల్ ఇప్పిస్తాలే అన్నాడు గఫార్.

వుజు చేసుకుని కాసేపు ఖుర్ఆన్ తీసుకుని చదివారు. మళ్ళీ కూలరు దగ్గర పడుకున్నారు.

నిద్రలో నీరే నీరు.. ఎటు చూసినా నీరే.. ఆహా... ఎంత నీరు... చల్లని నీరు.. తియ్యని నీరు.. కుండలో నీరు. ఫ్రిజులో నీరు. ...

ఎలాగో ఐదయ్యే వరకు మత్తు మత్తులాంటి నిద్రలో గడిపేశారు. అస్ర్ నమాజు టైమైంది. మస్జిదులో ఉన్నవారు ఇద్దరినీ లేపేశారు. నమాజు టైమైంది లేవండి అన్నారు. అప్పటి వరకు కలల్లో జలకాలాడుతున్న ఇద్దరు మళ్ళీ ఈ లోకంలోకి వచ్చి పడ్డారు. పోయి మళ్ళీ వుజు చేసుకుని వచ్చి కూర్చున్నారు. దాహం ఇంకా బాగా పెరిగిపోయింది. నోరు పూర్తిగా తడారిపోయింది. కనీసం కాస్త ఉమ్ము కూడా నోట్లో రావడం లేదు. వచ్చినా దాన్ని మింగలేరు. అస్ర్ నమాజయ్యింది.. ఇంకా రెండు గంటల టైముంది. ఎలా గడపడం? టైము ఆగిపోయినట్లనిపిస్తోంది. కాలం ఇంత భారంగా ఎప్పుడు గడవలేదు.

గఫార్ గాడు లేచి పద బయటకు వెళదాం అన్నాడు.

సిరాజ్ గాడు నీరసంగా...ఎక్కడికి పోతాంరా.. కాసేపిక్కడే ఉందాం అన్నాడు.

ఇక్కడ ఉంటే టైము గడవదు. బయట తిరిగొద్దాం. టైమ్ కిల్ చేయాలంటే కాసేపు బయట తిరిగితేనే సరి అన్నాడు.

ఇద్దరూ బయటకు వచ్చారు. ఎండ ధాటి ఇంకా తగ్గలేదు. లోపల కూలర్లున్నాయి కాబట్టి అర్థం కావడం లేదు కాని బయట చాలా ఎండే ఉంది. గఫార్ గాడు స్కూటరుకు ఒక్క తన్ను తన్ని స్టార్టు చేశాడు. ఊరికే సందుల్లో గొందుల్లో తిరుగుతున్నారు. దారిలో ఒకచోట రోడ్డు మీద ఎవరో నీళ్ళు పారబోశారు. ఒక కుక్క ఎంత దాహంతో ఉందో.. ఆ తడి మట్టినే నాకుతోంది. ఇద్దరూ దాన్ని చూశారు.

గఫార్ గాడు స్కూటరు పక్కన ఆపి... అక్కడే ఉన్న ఒక షాపు లోంచి వాటర్ బాటిల్ ఒకటి కొన్నాడు. వాడినే అడిగి డిస్పోజబుల్ ప్లేటు ఒకటి తీసుకున్నాడు. ఆ బాటిల్లో నీళ్ళు ఆ ప్లేటులో వేసి కుక్క ముందు పెట్టాడు. ఎంత దాహంతో ఉందో వెంటనే ఉరికి వచ్చి తాగేస్తోంది. మరికాస్త నీరు పోశాడు. ఆ తర్వాత ప్లేటులో నిండా నీళ్ళు పోసి ఆ పక్కనే ఒక వారగా ఉంచాడు. పక్షులో, జంతువులో ఏవయినా దాహమేస్తే వచ్చి తాగుతాయిరా అన్నాడు సిరాజ్‌తో... ఆ షాపు వాడిదంతా చూస్తూనే ఉన్నాడు. వాడు బయటకు వచ్చాడు. ఎప్పటి నుంచో షాపు నడుపుతు న్నాను.. నాకెప్పుడు ఈ ఆలోచనే రాలేదు. రేపటి నుంచి రోజు నేను కూడా చేస్తానన్నాడు.

గఫార్ గాడు మళ్ళీ డొక్కు స్కూటరు స్టార్టు చేశాడు.

ఆకలి కన్నా దాహం మహా చెడ్డదిరా అన్నాడు.

ఇప్పుడెక్కడికి వెళతాం.. కాసేపిక్కడే కూర్చుందాం అన్నాడు సిరాజ్ ఆ షాపు ముందున్న గట్టుమీద కూలబడి. షాపులో పేపరు అడిగి చదువుకుంటూ కూర్చున్నారు.

బిందెడు నీళ్ళ కోసం మైళ్ళ దూరం నడిచి వెళుతున్న మహిళలు... చంకలో పసిపిల్లలతో, చేతిలో బిందె పట్టుకుని నడుస్తున్న ఫొటో...

ఎందుకో వార్తలు చదవబుద్ధి కాలేదు... అసలు స్థిమితంగా లేదు.

గఫార్ గాడు స్కూటరును మరో తన్ను తన్ని కూర్చోరా అన్నాడు. మళ్ళీ మస్జిదుకు బయలుదేరారు. ఇఫ్తార్ టైమవుతుందిరా.... ఈ రోజు ఇఫ్తార్ పార్టీ ఉంది కదా వెళదామా అన్నాడు గఫార్. నాకు ఎక్కడికి వెళ్ళాలని లేదు. మస్జిదులోనే ఏదో ఒకటి తినేద్దాం. మస్జిదుకు పద అన్నాడు సిరాజ్. దారిలో ఒక ప్యాకెట్ ఖర్జూరాలు కొనుక్కున్నారు. డజను అరటిపండ్లు తీసుకున్నారు. మస్జిదుకు వచ్చేసరికి లోపల పెద్దగా జనం లేరు. ఇంకా ఇఫ్తార్‌కు టైముంది.

నెమ్మదిగా జనం వస్తున్నారు. మస్జిదులో ఇఫ్తార్ కోసం దస్తర్ ఖాన్ పరిచారు. అందరూ వచ్చి కూర్చుంటున్నారు. ప్రతివాడు తనతో పాటు ఏదో ఒకటి తీసుకు వస్తున్నాడు. ఆ దస్తర్ ఖాన్‌పై అందరి ముందు పెట్టేస్తున్నాడు. మస్జిదు కమిటీ కూడా ఏదో ఒక ఏర్పాటు చేస్తుంది. సిరాజ్‌గాడు వెళ్ళి నాలుగు గ్లాసుల చల్లని మంచినీరు పట్టుకుని దస్తర్ ఖాన్‌పై పెట్టుకుని కూర్చున్నాడు. తాము తెచ్చిన ఖర్జూరాలు, అరటిపండ్లు అక్కడకు వచ్చిన వారి ముందు పెట్టేశారు. ఏదీ తినాలని లేదు. నీరు తాగాలి అంతే.

గఫార్ గాడు మరో నాలుగు గ్లాసుల నీరు తెచ్చుకున్నాడు.

ఒక కుర్రాడు సిరాజ్ పక్కన వచ్చి కూర్చున్నాడు. తనతో తెచ్చిన సమోసాలు సిరాజ్ ముందు పెట్టాడు. సిరాజ్ ముందున్న నాలుగు గ్లాసుల నీళ్ళలో ఒక గ్లాసు తీసుకుని తన ముందు పెట్టుకున్నాడు. సిరాజ్‌కి ఒళ్ళు మండింది. వెళ్ళి గ్లాసు నీరు తెచ్చుకోవచ్చుగా. తన నీరే తీసుకోవాలా? కాని అలా చెప్పడం మర్యాద కాదు. గమ్మున ఊరుకున్నాడు.

ఇంకో గెడ్డం పెద్దాయన వచ్చాడు. తనతోపాటు ఆపిల్ పండ్లు తీసుకొచ్చాడు. అవి దస్తర్ ఖాన్ పై అందరి ముందు పెట్టేసి కూర్చున్నాడు. సిరాజ్ ముందున్న నీళ్ళ గ్లాసులు చూసి అందులో ఒక గ్లాసు తీసుకున్నాడు. లోలోపల మండుతున్నా సిరాజ్ చిరునవ్వు నవ్వడం తప్ప ఏమీ చెప్పలేడు. ఇంకా రెండు గ్లాసులు ఉన్నాయిలే.. రెండు గ్లాసులు ఒకేసారి తాగేస్తాను అనుకున్నాడు. ఈ లోపల హడావిడిగా వచ్చిన మరో పిల్లాడు సిరాజ్ కి మరోపక్క కూలబడ్డాడు. రెండు గ్లాసుల్లో ఒక గ్లాసు అతను తీసుకున్నాడు. ఇక ఒక్కటే గ్లాసు మిగిలింది. ఆ గ్లాసు ఎవ్వరూ తన ముందు నుంచి తీసుకోరు. ఎందుకంటే ఒక్కటే ఉంది కాబట్టి ఎవడికైనా కావాలంటే వెళ్ళి తెచ్చుకుంటాడు. టైము చూస్తే ఇంకా అరగంట ఉంది. ఈ నిముషాల ముల్లే కాదు, సెకన్ల ముల్లు కూడా నీరసంగా కదులుతున్నాయి.

సిరాజ్ నీళ్ళ గ్లాసునే చూస్తూ కూర్చున్నాడు.

ఎదురుగా ఉన్న గెడ్డం మౌల్వీ సిరాజ్ ని చూసి, "యే దువాకా వక్త్ హై బేటా... దువా కరో" అన్నాడు. నిజమే.. ఇఫ్తార్ సమయం ప్రార్థనల సమయం. కాని నీళ్ళ గ్లాసు ముందుంటే దాహం మరింత పెరిగిపోతోంది. ఏం చేయాలి. గఫార్ గాడితో నెమ్మదిగా.. ఇంకోసారి బయట తిరిగొద్దామా.. టైము గడవం లేదు అన్నాడు. ఇంకా ఎనిమిది నిముషాలే ఉందిరా.... నోర్మూసుకుని కూర్చో అన్నాడు గఫార్. సెకన్ల ముల్లు అస్సలు కదలడం లేదు. ఈ చివరి ఐదారు నిముషాలు ఐదారు యుగాల్లా ఉన్నాయి.

ఎక్కడో సైరన్... హమ్మయ్య టైమైపోయింది అనుకున్నాడు. కాని... ఈ మస్జిదు సైరన్ మోగలేదు. ఆగలేక... అదేంటి టైమైపోయిందిగా అని పైకే అనేశాడు.

మనకింకో నిముషం టైముంది.. కాస్త ఓపికపట్టు అన్నాడు గెడ్డం మౌల్వీ...

ఇక్కడికిక్కడే ఇంత టైము తేడా ఏంటో... సిరాజ్‌కి చికాకొచ్చింది. కాని ఏ మస్జిదు దాని టైము ప్రకారమే పనిచేస్తుంది. సిరాజ్ కోసం వాళ్ళు టైము మార్చుకోరు. మొత్తానికి సైరన్ మోగింది. ఇఫ్తార్ టైమైంది. దువా చేయగానే సాధారణంగా ఖర్జూరంతో ఉపవాసాన్ని విరమిస్తారు. కాని సిరాజ్ అవేమీ పట్టించుకునే స్థితిలో లేడు. వెంటనే గ్లాసు నీరు తాగేశాడు. నోట్లో నీరు పడగానే... స్వర్గం గుర్తుకు వచ్చింది. నరనరాల్లో మెరుపు ప్రవహించిన అనుభూతి. నాలుక్కి తగిలిన నీరు నెమ్మదిగా గొంతును తాకగానే... ప్రపంచంలో ఆనందం అంతా చేతికి దొరికిన ఫీలింగ్. ఇంకేమీ తినాలని లేదు. గఫార్ పరిస్థితి కూడా అంతే... ఇద్దరూ లేచి వాటర్ కూలర్ దగ్గరకు వెళ్ళి గబగబ గ్లాసుపై గ్లాసు నీళ్ళు తాగేశారు. ఎన్ని నీళ్ళు తాగారో తెలియదు. ఇంకేమీ తినాలనిపించడం లేదు. పొద్దుట పాయా తిని దాదాపు పదిహేను గంటలైంది. అయినా ఆకలి లేదు. నీళ్ళు...నీళ్ళు... అయినా దాహం తీరినట్లు లేదు. చాలా నీరు తాగారు.

అంత నీరు ఒకేసారి తాగిన తర్వాత కాసేపటికే కడుపులో వికారం మొదలైంది. ఇంకా నమాజు ప్రారంభం కాలేదు. మస్జిదు నుంచి బయటకు వచ్చారు. బయట ఒక దహీవడా అమ్మే బండి ఉంది. దాని పక్కన ఒక బెంచి ఉంది. దానిపై కూర్చున్నారు. పదిహేను గంటల తర్వాత తినడం తాగడం కాబట్టి సాధారణంగా ఇఫ్తార్ తర్వాత ఒక్కోసారి విపరీతమైన బడలిక మామూలే. ఆ బండివాడు "ఏం బాబు నలతగా ఉందా? మంచినీళ్ళు కావాలా?" అనడిగాడు... ఇద్దరు వద్దన్నారు.. ఒక్క అరగంట ముందు నీళ్ళ కోసం ఏమైనా ఇవ్వడానికి రెడీ అయిన వాళ్ళు, ఇప్పుడు నీరు తాగాలంటే కడుపులో తిప్పుతుందని భయపడుతున్నారు.

గఫార్ గాడు సిరాజ్ వైపు చూశాడు.

సిరాజ్ నవ్వుతూ.... అరగంటలో దాహం తీరిపోయింది. అరగంట క్రితం నీరే ప్రాణం... ఇప్పుడు నీరు తాగితే వికారం.

అసలు మనకేం కావాలో కూడా మనకు తెలియదురా బాబు అన్నాడు...

సరే పద నమాజు నిలబడుతుంది

ఇద్దరు మస్జిదులోకి నడిచారు.

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్‌హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

89 ఆయత్‌లు

# 43. అజ్ జుఖ్రుఫ్

మక్కా అవతరణ

## ప్రవేశిక (గత సంచిక తరువాయి)

దైవదూతల్ని వారు దేవతలుగా పరిగణిస్తారు. వాళ్ళ ప్రతిమలు స్త్రీ రూపంలో చెక్కారు. వారికి స్త్రీల దుస్తులు, ఆభరణాలు తొడుగుతారు. వీరు అల్లాహ్ కూతుళ్ళని అంటారు. వాటిని పూజిస్తారు. వాటిని మొక్కుకుంటారు, వాటికే నైవేద్యాలు అర్పించుకుంటారు, అవసరాలను అర్థిస్తారు. ఇంతకూ దైవదూతలు స్త్రీలని వారికి ఎలా తెలిసింది?

ఈ మూఢ నమ్మకాలను ఎత్తి చూపి తప్పుపడితే విధివ్రాతను సాకుగా ముందుకు తెస్తారు. అల్లాహ్ మేము చేసే దీన్నంతటినీ ఆమోదించకపోతే మేము ఈ విగ్రహాలను ఎలా పూజించగలిగే వాళ్ళమూ? అని అంటారు. వాస్తవమేమిటంటే అల్లాహ్ ఇష్టాఇష్టాలను తెలుసుకునే మార్గం ఆయన గ్రంథాలే కాని ప్రపంచంలో జరుగుతున్న కార్యకలాపాలు కావు. అవి ఆయన ఏర్పరచిన నియమం ప్రకారం జరుగుతుంటాయి. ఆయన నియమానుసారం ఒక్క విగ్రహారాధనే కాదు, దొంగతనం, వ్యభిచారం, దోపిడి, హత్య అన్నీ జరుగుతున్నాయి. ఈ వాదన ఆధారంగా ప్రపంచంలో జరుగుతున్న సకల చెడుగులను న్యాయసమ్మతమేనని, ధర్మబద్ధమేనని పరిగణించవలసిందేనా?

మీరు చేసే ఈ షిర్క్‌కు మీ వద్ద ఈ తప్పుడు వాదన తప్ప మరేదయినా ప్రమాణమున్నదా అని ప్రశ్నించడం జరుగుతోంది. దానికి బదులుగా, మా తాత ముత్తాతల కాలం నుంచి ఇది ఇలాగే జరుగుతూ వస్తోంది అని వారంటారు. అంటే వారి దృష్టిలో ఒక మతం ధర్మమయింది అనడానికి ఇది సరయిన ఆధారమే అన్నమాట. వాస్తవానికి హజ్రత్ ఇబ్రాహీమ్ సంతాన మవడమే వీరి సమస్త గర్వానికీ, ప్రత్యేకతలకు ఆధారం, ఆయనేమో తాతముత్తాతల మతాన్ని కాలదన్ని ఇంటి నుండి వెళ్ళిపోయారు. ఆయన సమంజసమయిన ఆధారమేదీ లేని పూర్వీకుల అంధానుకరణను గట్టిగా నిరాకరించారు. అయినప్పటికీ వీరు తమ పూర్వీకుల అనుకరణే చేయాలనుకుంటే దానికీ తమ అత్యంత ఆదరణీయమయిన పూర్వీకులు ఇబ్రాహీమ్, ఇస్మాయీల్ (అలైహిమస్సలామ్)లను కాదని తమ అత్యంత మూఢులయిన పూర్వీకులను ఎన్నుకున్నారే!

ఎప్పుడయినా ఏ ప్రవక్త అయినా దైవం వద్ద నుండి వచ్చిన ఏ గ్రంథమయినా, అల్లాహ్‌తో పాటు ఇతరులు సయితం ఆరాధనకు అర్హులే అని బోధించడం జరిగిందా? అని వీరినడిగితే వీరు క్రైస్తవుల చర్యను ఆధారంగా పేర్కొంటారు, వారు మర్యమ్ కుమారుడు ఈసాను దేవుని కుమారునిగా నమ్మి ఆయన్ని ఆరాధించారని. నిజానికి అడిగింది, ఏ ప్రవక్త అనుచర సమాజమయినా బహుదైవారాధనకు పాల్పడిందా లేదా అన్నది కాదు, స్వయంగా ఏ ప్రవక్త అయినా బహుదైవారాధనను బోధించారా అన్నది. మర్యమ్ కుమారుడు ఈసా (అ) తాను దేవుని కుమారుడని, నన్నే ఆరాధించండని ఎప్పుడు బోధించారని? ప్రపంచంలోని ప్రతి ప్రవక్త బోధించినదే ఆయనా బోధించారు. అల్లాహ్ మాత్రమే నాకూ ప్రభువు, మీకూ ప్రభువు అనీ, ఆయన్నే ఆరాధించాలని మాత్రమే బోధించారు.

ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) దైవదౌత్యాన్ని స్వీకరించేందుకు వారు వెనుకంజవేయడానికి కారణం ఏమి టంటే, ఈయన వద్ద నయితే సిరిసంపదలు, అధికారం, హోదాలు ఏవీ లేవు. వారనేదేమిటంటే దైవం మా ప్రాంతంలో ఎవరినయినా ప్రవక్తగా చేయదలిస్తే మా ఉభయ నగరాల (మక్కా, తాయిఫ్‌ల)లోని పెద్ద మనుషులలో ఎవరినయినా చేయవలసింది. ఈ కారణంగానే ఫిర్ఔన్ కూడా హజ్రత్ మూసాను హేయంగా పరిగణించాడు. అతనూ ఇలాగే అన్నాడు, ఆకాశాల రాజు, భూమిలోని రాజునయిన నా వద్దకు ఎవరినయినా రాయబారిగా పంపేమాటయితే అతనికి సువర్ణ కంకణాలు ధరింపజేసి, దైవదూతల ఒక సేనను అతని బంట్రోతులుగా ఇచ్చి పంపేవాడు. ఈ ఫకీరు ఎక్కడి నుండి ఊడిపడ్డాడు? విశిష్టత నాకే ప్రాప్తమయి ఉంది, ఈజిప్ట్ రాచరికం, పరిపాలన నాకే చెందినది. నైలునది కాలువలు నా అధీనంలో పారుతున్నాయి. నాకు సదృశంగా ఈ వ్యక్తి స్థితీ స్థానం ఏమిటీ? ధనమూ లేదు, అధికారమూ లేదు!

ఈ విధంగా తిరస్కారుల ఒక్కొక్క అజ్ఞానపూర్వకమయిన మాటను విమర్శించి, దానికి అత్యంత సమంజసమయిన, హేతుబద్ధమయిన సమాధానాలు సాధారంగా ఇచ్చిన తరువాత చివరగా అతి స్పష్టంగా చెప్పివేయడం జరిగింది. దైవానికి సంతానమంటూ ఏదీ లేదు, భూమికీ ఆకాశాలకు వేర్వేరు దైవాలూ లేవు. అన్నీ తెలిసీ అపమార్గాన్ని అవలంబించే వారికి దేవుని శిక్ష నుండి కాపాడేటటువంటి సిఫారసు దారుడూ దైవం వద్ద ఎవడూ లేడు. అల్లాహ్ వ్యక్తిత్వం ఎంతో పునీతమయింది, ఆయనకు సంతానం ఏదీ లేదు. ఆయన ఒక్కడే సకల సృష్టి యావత్తుకూ దైవం. ఆయన తప్ప మిగతా అంతా ఆయన దాస్యం చేసేవే. ఆయనతో పాటు దైవగుణగణాలలో, అధికారాలలో ఎవరూ ఆయనకు భాగస్వాములుకారు. స్వయంగా ధర్మపరాయణులయినవారే ఆయన సన్నిధిలో సిఫారసు చేయగలరు. వారున్నూ, ప్రపంచంలో ధర్మపరాయణతలు అవలంబించిన వారి ఎడలనే సిఫారసు చేయగలరు.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ
3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్) గొప్పదనం

అధ్యాయం : 36

## అన్సార్ల పట్ల ప్రేమాదరణలు కలిగి ఉండటం గురించి

**419)** ప్రవక్త మహనీయులు(సఅసమ్) ద్వారా నేను విన్నాను లేదా ఆయన (స) ఈ విధంగా చెప్పారని హజ్రత్ బరా బిన్ ఆజిబ్(రజి) చెప్పారు. ప్రవక్త(స) ఇలా చెప్పారు: "అన్సార్ల పట్ల కేవలం విశ్వాసి (మూ'మిన్) మాత్రమే ప్రేమాదరణలు కలిగి ఉంటాడు. కేవలం కపటి (మునాఫిక్) మాత్రమే వారి పట్ల శత్రుత్వం కలిగి ఉంటాడు. కాబట్టి వారి యెడల ప్రేమాదరణలు కలిగి ఉన్నవానిని అల్లాహ్ ప్రేమిస్తాడు. వారి పట్ల శత్రుత్వం కలిగి ఉన్న వాని పట్ల అల్లాహ్ శత్రుత్వం కలిగి ఉంటాడు.

అధ్యాయం : 40

## ప్రవక్త మహనీయులు(స) అన్సార్లతో ఇలా పలకటం....

"కౌసర్ సరస్సు వద్ద మీరు నన్ను కలుసుకునేవరకూ మీరు ఓర్పు వహించండి".

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జైద్(రజి) దైవప్రవక్త(స) నుండి దీనిని ఉల్లేఖించారు.

**428)** హజ్రత్ ఉసైద్ బిన్ హుజైర్(రజి) కథనం : 'దైవప్రవక్తా(స)! ఫలానా వ్యక్తికి అధికార పదవి ఇచ్చినట్లుగా నాకూ ఒక పదవిని ఇవ్వండి' అని ఒక అన్సార్ సహాబీ విన్నవించుకోగా, ఆయన(స) ఇలా సమాధానమిచ్చారు: "నా తదనంతరం (ప్రాపంచిక వ్యవహారాలలో) ఇతరులకు మీపై ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుంది. కాబట్టి కౌసర్ సరస్సు వద్ద మీరు నన్ను కలుసుకునే వరకూ సంయమనంతో వ్యవహరించండి."[1]

**430)** అనస్ బిన్ మాలిక్(రజి) చెప్పగా యహ్యా బిన్ సయీద్ విన్నారు- ఆయన అనస్ బిన్ మాలిక్(రజి) వెంట ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్ మాలిక్ వద్దకు వెళ్ళడానికి బయలుదేరారు. ఆ సందర్భంగా ఇలా అన్నారు: దైవప్రవక్త(స) అన్సార్లను పిలిపించారు. బహ్రయిన్ రాష్ట్రాన్ని అన్సార్లకు జాగీరుగా వ్రాసి ఇవ్వాలని సంకల్పించుకున్నారాయన. అప్పుడు అన్సార్లు, 'దైవప్రవక్తా! తమరు మా సహోదరులైన ముహాజిర్లకు కూడా ఇలాంటి జాగీరే ప్రదానం చేయనంతవరకూ మాకు ఇది సమ్మతం కాద'ని నిర్మొహమాటంగా చెప్పేశారు. అప్పుడు ప్రవక్త మహనీయులు(స) ఇలా ఉపదేశించారు: "చూడండి, ఈ రోజు ఈ బహుమానాన్ని మీరు స్వీకరించటం లేదు. మరి అలాగైతే నా తదనంతరం కూడా ఇలాగే ఓర్పు వహించండి. నన్ను చేరుకునే వరకూ నిగ్రహం కోల్పోకూడదు. ఎందుకంటే నా తదనంతరం- త్వరలోనే- మీ హక్కులకు విఘాతం కలగబోతోంది."[1]

428-1. ఇలా విన్నవించుకున్న వ్యక్తి ఎవరో కాదు, స్వయంగా ఉసైద్ బిన్ హుజైర్ గారేనని హాఫిజ్ ఇబ్నె హజర్(రహ్మ) పేర్కొన్నారు.
430-1. అంటే అనర్హులు కొంతమంది పదవులను అలంకరిస్తారు. మీరు ఉపేక్షించబడతారు. బనూ ఉమయ్యా కాలంలో జరిగింది అదే. ఆ విధంగా దైవప్రవక్త(స) భవిష్యవాణి అక్షరాలా నిజమయింది. అయితే అన్సార్లు మాత్రం ఎంతో సంయమనంతో వ్యవహరించి, దైవప్రవక్త(స) వసీయతుకు కట్టుబడ్డారు.




మూలం: మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి (రహ్మ)    అనువాదం: ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

**ఈ ప్రపంచంలోని** వివిధ వస్తువులు ఒండొక దానికి విరుద్ధంగా ఉన్నప్పటికీ వాటి మధ్యన అనిర్వచనీయమైన అనుబంధం, బాంధవ్యం కనిపిస్తుంది- అచ్చం దంపతుల మధ్యన ఎలాంటి సఖ్యత, సమన్వయం ఉంటుందో అలాంటి సమన్వయమే ఈ వస్తువులలోనూ ఉంటుంది. ఒక స్త్రీ తన అంతర్బాహ్య స్వభావ స్వరూపాల రీత్యా పురుషుని కన్నా భిన్న స్థితిలో ఉంటుంది. అలాగే ఒక పురుషుడు స్త్రీకన్నా పూర్తిగా విభిన్న ప్రత్యేకతలు కలిగి ఉంటాడు. అయినప్పటికీ వారిద్దరి మధ్య గల మానసిక, శారీరక సంబంధం అనిర్వచనీయం. స్త్రీ దగ్గర ఉన్న వస్తువు పురుషునికి కావలసిన వస్తువే కాదు, అతనికి ఎంతో ఇష్టకరమయిన వస్తువు కూడా. స్త్రీయే గనక లేకపోతే పురుషుని శక్తిసామర్థ్యాల, ప్రజ్ఞాపాటవాల ఒక పెద్ద భాగం అర్థరహితం అయిపోతుంది. అలాగే పురుషుని వద్ద ఉన్నది స్త్రీ నైజం వాంఛించే వాటికి సరైన సమాధానం. ఒకవేళ పురుషుడు ఆమె కోర్కె తీర్చలేని అసమర్థుడై ఉంటే ఆమెలోని విశిష్ట గుణాలు ఫలవంతమయ్యేందుకు ఆస్కారమే ఉండదు. ఇద్దరూ ఒకరింకొకరికి బెటర్ హాఫ్ వంటి వారు.[1] జగతిలోని వివిధ వస్తువులన్నింటి పరిస్థితి ఇంతే. నింగి- నేల, రాత్రి-పగలు, వేసవి-చలి, వెలుగు-చీకటి, వేడిమి-చల్లదనం అన్నీ ఆలుమగల మాదిరిగా పరస్పర విరుద్ధ గుణాలు కలిగి ఉండి కూడా వారి లాగానే అన్యోన్యత కలిగి ఉన్నాయి. స్త్రీ- పురుషులు ఏ విధంగానైతే ఒండొకరు లేకుండా-ఒంటరితనం వారి ఉనికిని నిరర్థకం చేసివేస్తుందో అదేవిధంగా ఈ పరస్పర విరుద్ధ స్వభావం గల వివిధ వస్తువులు (భాగాలు) తమ జంట లేకుండా ఉంటే వాటి ఉనికి అర్థరహితం అయిపోతుంది. తన జంటతో కలిసినప్పుడే ఏ వస్తువు అయినా తన లక్ష్యాన్ని ఛేదించగలుగుతుంది.

సఖ్యత, సమన్వయానికి సంబంధించిన ఈ కోణం కేవలం పరస్పర విరుద్ధ గుణాలు కల వాటిలోనే లేదు. పైగా ఈ జగతిపై దృష్టిని సారించినప్పుడు అందులో ఓ సర్వతోముఖమైన సమన్వయం, క్రియాశీలత ఉందన్న వాస్తవం అవగతమవుతుంది. ప్రతి వస్తువూ తన ఉనికిని కాపాడుకునేందుకు, తన మనుగడను సాగించేందుకు, ఇక్కడి సువిశాలమైన కర్మాగారం తన కొరకు ఎల్లవేళలా పనిచేస్తూ ఉండాలని కోరుకుంటుంది. భూమిలో మొలకెత్తిన ఒక గోధుమ మొక్కనే చూడండి, ఈ ప్రపంచంలోని శక్తులన్నీ దాని పరిపోషణలో, పర్యవేక్షణలో తమ వంతు పాత్రను పోషించనంతవరకూ అది తన పరిపూర్ణ స్థితికి చేరుకోదు. భూమి దాని కోసం మెత్తబడాలి. మబ్బుతునక దాని కోసం కారుణ్యం మోసుకు

# తౌహీద్ వాస్తవికత

రావాలి. సూర్యుడు దానికి వేడిమి ఇవ్వాలి. మంచు దానికి చల్లదనం ఇస్తూ ఉండాలి. పిల్లగాలులు దానికి జోలపాట, లాలిపాట పాడి వినిపిస్తూ ఉండాలి.[2] ఇవన్నీ సకాలంలో- నియమబద్ధంగా- పనిచేస్తేనే గోధుమ పంట చేతికి వస్తుంది. ఈ జగతిలోని వస్తువులన్నింటి పరిస్థితీ ఇంతే.

ఇప్పుడొక ప్రశ్న- ఈ జగతి పరిణామం దానంతట అదే జరిగిందా? లేక దీని వెనుక ఒక గొప్ప ఆలోచనాపరుడు ఉన్నాడా? ఆయన ఈ జగతిలోని విభిన్న భాగాల మధ్య సఖ్యతను, సమన్వయాన్ని ఏర్పరచి, వాటి పురోగతికి తోడ్పడు తున్నాడా? ఒకవేళ ఈ జగతి కాకతాళీయంగా జరిగిన సంఘటన (Accident) అనీ, అది దానంతటదే ఉనికిలోనికి వచ్చిందనీ, అందులోని విభిన్న భాగాల క్రమ వికాసం కూడా దానంతటదే జరుగుతుందని అనుకుంటే, మరి ఆ విభిన్న భాగాల మధ్యన సమన్వయం, సహకార భావాన్ని జనింపజేయటం కూడా యాదృచ్ఛిక సంఘటనేనా? ఈ గాలి, నీరు, అగ్ని, మట్టి, నదీనదాలు, కొండలు, ఎడారులు, సూర్యచంద్రులు, పశుపక్ష్యాదులు-ఇవన్నీ యాదృచ్ఛిక సంఘటనలుగానే ఉనికిలోనికి వచ్చాయని, ఆ తరువాత ప్రతి భాగం స్వయంగా క్రమవికాసమొందిందనీ, ఆపైన ఆయా విడిభాగాల మధ్య ఆశ్చర్యకరమైన రీతిలో సంఘీభావం జనించిందనీ, ఇవన్నీ కేవలం మనిషి సేవ కోసం అంకితమైనాయని ఏ బుద్ధిమంతుడైనా నమ్మబలుక గలడా? మరి మానవబుద్ధి ఈ రకమయిన ఆశ్చర్యకరమైన కాకతాళీయ సంఘటనల్ని ఒక్క క్షణం కోసమైనా అంగీకరించగలదా?

పరిస్థితుల ఈ స్వరూపం ఈ విషయానికి సంబంధించి ఎంతో గట్టిగా నిరూపించేదేమిటంటే; ఈ బ్రహ్మాండమైన ప్రపంచం వెనుక ఒక గొప్ప వివేకవంతుడు, వజ్ర సంకల్పం కలవాడు ఉన్నాడు. ఆయనే దీనిని ఉనికిలోనికి తీసుకువచ్చాడు. ఆయన జ్ఞానం, శక్తి, పరిపోషణ, వివేచనకు సంబంధించిన అన్ని గుణగణాలతో అలరారుతున్నాడు. ఆయనే తన జ్ఞానధనంతో, ఔచితీ విజ్ఞతలతో ఈ విభిన్న భాగాల (వస్తువుల) మధ్య సమన్వయం ఏర్పరచాడు. వాటిని మంచి లక్ష్యాల కోసం ఉపయోగిస్తున్నాడు. దీంతోపాటే మరో విషయానికి సంబంధించి కూడా లభించిన సాక్ష్యమేమిటంటే నింగి నుండి నేలవరకూ,

---

1. "నీవో సగం, నేనో సగం. సగాలు రెండూ ఒకటై పోతే జగానికే ఓ నిండుదనం" అని భార్యాభర్తలు చెప్పుకున్న ఊసుల్లో ఎంతో నిజముంది. (1970ల్లో వచ్చిన 'మంచివాడు' సినిమాలోని ఒక పాటలో భాగం) **– అనువాదకుడు**

2. పుస్తక రచయిత మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహీ (రహ్మ) పాండితీ ప్రకర్షకు ఇది ప్రతిబింబం. ఈ పంక్తుల్ని తెనుగీకరిస్తున్నప్పుడు నేను ఎంతో తన్మయత్వానికి లోనయ్యాను. గతంలోకి వెళ్ళిపోయాను. 1985లో 'ప్రభుగానం'లో భాగంగా గురువర్యులు, గీటురాయి సంపాదకులు శ్రీ ఎస్.ఎం మలిక్ వ్రాసిన స్తుతిగీతిక జ్ఞప్తికి వచ్చింది. ఆ గేయంలోని ఒక చరణం ఇది :

   తొలిజాములోని తెలుపు- తొలి పొడుపులోని ఎరుపు

   ఇలగాలి పాడె పాటా- తలలూపె చెట్ల రూపు

   నీ జ్యోతికే ప్రతీక- నీ స్మరణకో స్వరూపం

   నీ స్తుతిలో చేసే గానం- నా హృదయ లోక స్వర్గం

   సాయంత్రం (9-2-2024) ఆరున్నరకు ఇంటికి చేరుకోగానే మలిక్ గార్కి ఫోన్ చేసి, ఈ పుస్తకంలో రచయిత ప్రస్తావించిన ఈ అంశాలను వినిపించి, "మీ కవిత్వం మీద దీని ప్రభావం బాగా పడినట్టుందే" అన్నాను. ఉదాహరణగా ఆయన గారి ఈ స్తుతిగీతికనే వినిపించాను. మొదట ఆయన ఉలిక్కిపడ్డారు. భావుకులయ్యారు. భావోద్వేగం నుండి తేరుకున్న మీదట, "1960ల్లో నేను మద్రాసులో ఉన్నప్పుడు, ఒక మురబ్బీ పర్యవేక్షణలో చదివిన పుస్తకాలలో ఇది కూడా ఒకటి. పుస్తకాల అధ్యయనం చేసి వాటిని జీర్ణించుకోనంతవరకూ మన మాటల్లో, చేతల్లో, రచనల్లో, కవనంలో, ప్రసంగాల్లో ఆ రిఫ్లెక్షన్ ఉండదు నాయనా!" అన్నారు.

   ఇస్లామీయ ఉద్యమం తొలి కాలానికి చెందిన కార్యకర్తల్లో పుస్తక పఠనం పట్ల గల ఆసక్తికి, అనురక్తికి ఇదొక మచ్చుతునక.

   **– అనువాదకుడు**

నింగికీ-నేలకు మధ్యన ఒకే యజమాని ఉన్నాడు. నిర్వహణాధికారం అంతా ఆయనకే స్వంతం. ఇందులో మరొకరి సంకల్పానికి ఎలాంటి ప్రమేయం లేదు. ఆయనకు భాగస్వామి, సహవర్తుడు ఎవడూ లేడు. ఒకవేళ గగనభువనాలలో వేర్వేరు నిర్వహణాధికారులు ఉంటే, వేర్వేరు వ్యూహకర్తలు ఉంటే లేదా అనేక సంకల్పాలకు ఇందులో ప్రమేయం ఉంటే లేదా మేలు- కీడుకు, వెలుగుకు- చీకటికి వేర్వేరు దేవుళ్ళు ఉంటే జగతిలోని ఈ విభిన్న భాగాల మధ్యన సఖ్యత, సహకార భావం, సమన్వయం ఉండేది కాదు. (పైగా జగతిలో సర్వత్రా అలజడి, అల్లకల్లోలం నెలకొని ఉండేది). ఈ విషయాన్ని ఖుర్‌ఆన్ అనేక విధాలుగా, అనేక ఉపమానాలతో విశదీకరించింది. దృష్టాంతానికి మేము కొన్ని దివ్య వచనాలను పొందుపరుస్తున్నాము-

**ప్రతి వస్తువునూ మేము జంటలుగా సృష్టించాము. బహుశా మీరు గుణపాఠం నేర్చుకుంటారని. కనుక పరుగెత్తండి అల్లాహ్ వైపునకు, నేను ఆయన తరఫున మీకు స్పష్టంగా హెచ్చరిక చేసేవాడుగా వచ్చాను. అల్లాహ్‌తోపాటు మరెవరినీ ఆరాధ్యులుగా చేసుకోకండి. నేను ఆయన తరఫున మీకు స్పష్టంగా హెచ్చరించేవానిగా వచ్చాను.** ***(అజ్ జారియాత్: 49-51)***

ఇందులో ప్రతి వస్తువూ జంటలు జంటలుగా ఉండటం వల్ల ఇది దేవుని ఏకత్వం- పరలోకం, రెండింటికీ నిదర్శనంగా ఉంది. పరలోకం ఇక్కడ చర్చనీయాంశం కాదు. దీనికి సంబంధించిన తఫ్సీళ్లు ఇన్‌షాఅల్లాహ్ 'పరలోక వాస్తవికత' అనే మా పుస్తకంలో వస్తాయి. తౌహీద్‌కు (దేవుని ఏకత్వానికి) నిదర్శనంగా మేము చెప్పేదేమంటే, ఈ జగతిలోని ప్రతి వస్తువూ జంటలు జంటలుగా పుట్టించబడింది. ప్రతిదీ తన జంటతో జత కట్టి తన ఉద్దేశాన్ని పూర్తి చేసుకుంటుంది. దీని ద్వారా రుజువు అయ్యేదేమిటంటే ఈ జగతి యొక్క ఉనికి, దాని మనుగడ అందలి పరస్పర విరుద్ధ భాగాల సమన్వయంపైనే నిలిచి ఉంది. దీని ద్వారా తేటతెల్లమయ్యేదేమిటంటే, వాటిని సృష్టించినవాడు, ప్రణాళికా రచన చేసేవాడు ఒక్కడే. ఆ వస్తువుల్లో వైరుధ్యం, వ్యాఘాతం ఉన్నప్పటికీ ఆయన వాటి మధ్యన సంఘీభావాన్ని సృజించి, వాటి చేత సత్ఫలితాలు వెలికి తీస్తున్నాడు. మనం ఈ విశ్వ వ్యవస్థలో చూస్తున్న వైరుధ్యం కేవలం బాహ్యపరమయిన వైరుధ్యం మాత్రమే. దీని వెనుక అనేక మంది ఉద్దేశ్యాలు ఉన్నాయనడానికి ఇది తార్కాణం కానే కాదు. పైగా ఈ పరస్పర విరుద్ధ వస్తువులు ఒండొక దానితో కలసి పనిచేయటం, మంచి ఫలితాలను రాబట్టడం- ఇదంతా సూచించేదేమిటి? దీని వెనుక ఒక గొప్ప శక్తిమంతుడున్నా డని, ఆయన ఆదేశాలకు లోబడి అవి తమ కర్తవ్యపాలన చేస్తున్నాయనడానికి ఇది నిదర్శనం కాదా? ఈ నిదర్శనానికి సంబంధించిన వివరణ అల్ బఖరా సూరాలో ఈ విధంగా ఇవ్వబడింది:

**"మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది. మీ కొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటు చేసి మీకు ఉపాధి కల్పించినవాడూ ఆయనే! ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి."** ***(అల్ బఖరహ్ : 21,22)***

అంటే భూమ్యాకాశాలు ఏ విధంగా సమన్వయంతో, సహకార భావంతో అతని సేవలో నిమగ్నమై ఉన్నాయో మనిషి తన రెండు కళ్లతో చూస్తూనే ఉన్నాడు. భూమి అతని కోసం పాన్పులాగా పరచబడి ఉంది. ఆకాశం పందిరిలాగా తయారై ఉంది. మరి ఆకాశం నుండి వర్షం కురుస్తుంది. భూమి వర్షపు నీటిని పీల్చి పండ్లు ఫలాలను ఉత్పత్తి చేస్తుంది. ఆ పండ్లు మనిషికి ఎంతో రుచికరమైనవి. ఇష్టకరమైనవి. అవి అతని జీవితానికి, మనుగడకు ఆధారంగా ఉన్నాయి. ఇదంతా చూస్తూ కూడా మానవుడు ఆకాశ దేవత వేరని, భూదేవత వేరని, వర్షం కురిపించే వారు వేరని, పండ్లు ప్రసాదించే వారు వేరని ఎలా ఊహించుకుంటాడు? ఒకానొక కార్యనిర్వాహకుడు, యుక్తితో, శక్తితో, ఒకానొక ప్రత్యేక లక్ష్యం కొరకు విరుద్ధ వస్తువులకు పని చెప్పినప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఇదే నిదర్శనం మరింత విస్తారంగా మరోచోట విశదీకరించబడింది:

**మీ దేవుడు ఒక్కడే. ఆ కరుణామయుడు, ఆ కృపాకరుడు తప్ప మరొక దేవుడు లేడు. (ఈ సత్యం గ్రహించటానికి ఏవైనా గుర్తులు, తార్కాణాలు అవసరం అయితే) వివేకం ఉన్నవారికి భూమ్యాకాశాల నిర్మాణంలో, రేయింబవళ్ళు ఒకదాని వెంట ఒకటి**

**చేసే నిరంతరమైన పయనంలో, ప్రజా బాహుళ్యానికి ఉపయోగపడే వస్తువులు మోసుకుంటూ నదులలో, సముద్రాలలో సంచరించే ఓడలలో, పైనుండి అల్లాహ్ కురిపించే వర్షపు నీటిలో– తద్వారా ఆయన మృత భూమికి ప్రాణం పోస్తాడు. (ఈ ఏర్పాటు ద్వారా) భువిలో వివిధ ప్రాణులను వర్థిల్లజేస్తాడు– వాయువుల సంచారంలో, భూమ్యాకాశాల మధ్య అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడి ఉన్న మేఘమాలికలలో అసంఖ్యాకమైన సూచనలు కానవస్తాయి.** ***(అల్ బఖరహ్– 163, 164)***

అన్ నహ్ల్ సూరాలో ఇంతకన్నా వివరంగా ఈ విశ్వంలో గల సామరస్యాన్ని, సంఘీభావాన్ని స్పష్టం చేయడం జరిగింది:

**"(మీరు ప్రతి వర్షాకాలంలోనూ చూస్తారు) అల్లాహ్ ఆకాశం నుండి నీళ్ళను కురిపించాడు. నిర్జీవంగా పడివున్న భూమిలో ఒక్కసారిగా దాని ద్వారా ప్రాణం పోశాడు. నిశ్చయంగా ఇందులో వినేవారికి ఒక నిదర్శనం ఉన్నది. మీకు పశువులలో కూడా ఒక గుణపాఠం ఉన్నది. వాటి గర్భంలో పేడ, రక్తానికి మధ్య ఉన్న ఒక వస్తువును మేము మీకు త్రాగిస్తాము. అంటే స్వచ్ఛమైన పాలు. అది త్రాగేవారికి ఎంతో కమ్మనిది. (ఇదే విధంగా) ఖర్జూరపు చెట్లు, ద్రాక్ష తీగెల నుండి కూడా మేము ఒక పదార్థాన్ని మీకు త్రాగిస్తాము. దానిని మీరు మత్తు పానీయంగా కూడా చేసుకుంటారు, పరిశుద్ధమైన ఆహారంగా కూడా. బుద్ధిని ఉపయోగించే వారికి ఇందులో నిశ్చయంగా ఒక సూచన ఉంది. చూడండి, మీ ప్రభువు తేనెటీగకు వహీ ద్వారా ఈ విషయాన్ని తెలిపాడు. "కొండలలో, చెట్ల మీద, తడికలపై ఎక్కించబడిన తీగెలలో నీ తెట్టెలను నిర్మించుకో. అన్ని రకాల పండ్ల రసాన్ని పీల్చు, నీ ప్రభువు సుగమం చేసిన మార్గాలపై నడుస్తూ ఉండు". ఈ ఈగ కడుపులో నుండి రంగురంగుల పానకం ఒకటి వెలువడుతుంది. అందులో ప్రజల కోసం వ్యాధి నివారణ శక్తి ఉన్నది. ఆలోచించే వారికి ఇందులో కూడా నిశ్చయంగా ఒక సూచన ఉంది."**

***(అన్ నహ్ల్ : 65-69)***

ఈ దివ్య వచనాలలో విశ్వంలో గల సర్వతోముఖమయిన సామరస్యం సూచించబడింది. మేఘాల నుండి వర్షం కురుస్తుంది. దాంతో మృతభూమి కాస్తా సస్యశ్యామలం అవుతుంది. ఆ పచ్చగడ్డిని పశువులు మేస్తాయి. దాంతో ఆ పశువుల్లో పాలు తయారవుతుంది. పశువుల కడుపుల్లో రక్తానికీ-పేడకూ మధ్య నుండి తెల్లని, స్వచ్ఛమయిన పాలధారలు చిమ్ముకు వస్తాయి. త్రాగేవారికి ఆ పాలు ఎంతో కమ్మనిది, బలం చేకూర్చేదీను. మరి ఆ వర్షపు నీటితో పండిన ద్రాక్ష పండ్లు, ఖర్జూర పండ్లతో మనిషి రకరకాల పదార్థాలు తయారు చేస్తాడు. మరి తేనెటీగలనే చూడండి. అవి పర్వతాల మెరక ప్రదేశాల్లో, చెట్లకొమ్మలపై, ద్రాక్ష తీగెలపై తమ తేనె తెట్టుల్ని నిర్మించుకుంటాయి. రకరకాల పువ్వుల రసాన్ని పీల్చి, దానిని ఒకచోట సేకరిస్తాయి. వాటి రంగులూ వేర్వేరుగా ఉంటాయి. రుచులు కూడా వేర్వేరుగా ఉంటాయి. మనిషి దానిని సేవించి, రుచిని ఆస్వాదిస్తాడు. వ్యాధులకు ఆ తేనెలో నివారణ ఉంది. గుణపాఠం నేర్చుకునే ఉద్దేశంతో ఈ దృశ్యాలను చూసిన వ్యక్తి ఎవరయినా సరే, ఇదంతా కాకతాళీయంగా జరిగిన సంఘటనేనని ఎలా అనుకుంటాడు? ఈ నింగీ నేలా, వాటిలోని వివిధ సుందర దృశ్యాలు అనేకమంది దేవీదేవతల పనితనమా? ఏ జగతిలో విభిన్న భాగాల మధ్య పటిష్టమైన సంబంధం ఏర్పడిందో, ఏ ప్రపంచం తనలోని పరస్పర విరుద్ధమైన భాగాల మధ్య సఖ్యత సామరస్యానికి సంబంధించిన ఇన్ని పార్శ్వాలను కలిగి ఉందో, అదేదో యాదృచ్ఛికమైన సంఘటన కాజాలదు. అందులో వివిధ మనస్తత్వాల జోక్యం ఉండదు. బాహ్య చక్షువులు కేవలం ఎగిసి పడే సముద్ర కెరటాలను మాత్రమే చూడగలుగుతాయి. కాని ఆ జలనిధి అగాథంలోని ఆణిముత్యాన్ని, ఆణిముత్యం లోపల పోషించ బడుతున్న దానిని చూపులు అందుకోలేవు. ఈ యథార్థం వైపునకే దివ్యఖుర్‌ఆన్ మన దృష్టిని మరల్చింది- మీరు ఈ ప్రపంచంలోని వైరుధ్యాలను మాత్రమే చూడకండి, ఆ వైరుధ్యాల సంఘర్షణలో జనించే సత్ఫలితాలను చూడండి అని అంటోంది ఖుర్‌ఆన్. ❑

ఈ వ్యాసం **'తౌహీద్ వాస్తవికత'** పుస్తకంలోనిది. పూర్తి పుస్తకం చదవదలచిన వారు తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ వారిని సంప్రతించగలరు.

# మెడికల్ సైన్స్ వెలుగులో రమజాన్ ఉపవాసాలు



డా॥ హకీం ముహమ్మద్ జఫర్

### పిల్లలకు పాలిచ్చే తల్లులు- రమజాన్ ఉపవాసాలు

మెడికల్ సైన్స్ కూడా తల్లిపాల ప్రాముఖ్యతను సర్వ శ్రేష్టమైనదిగా పేర్కొనడం జరిగింది. ఇటువంటి పాలిచ్చే తల్లులు తమ ఆరోగ్య స్థితిని దృష్టిలో ఉంచుకొని ఫ్యామిలీ డాక్టర్ల సలహా మేరకు ఉపవాసాలు పాటించవచ్చు.

### 0-6 నెలలు

పిల్లల వయస్సు 0-6 నెలల లోపున్న కాలంలో రమజాన్ ఉపవాసాలు పాటించరాదని పీడియాట్రీషన్స్ చెబుతున్నారు. ఎందుకనగా ఈ కాలంలో పిల్లలకు పూర్తిగా ఆహారం తల్లి పాలే కావడం. మాటిమాటికి వారికి పాలు తాగించాల్సిన అవసరం ఉంటుంది. ఈ కాలంలో తల్లి మంచి పౌష్టికాహారం తీసుకోవలసిన అవసరం తప్పక ఉంటుంది. కావున మొదటి ఆరు నెలలు రమజాన్ ఉపవాసాలు ఉండరాదని డాక్టర్లు చెబుతున్నారు.

గర్భదారణ సమయంలో వ్యాధులు ఉన్నవారు, ప్రసవం తర్వాత వ్యాధులు ఉన్నవారు, మందులు వాడుతున్న కాలంలో రమజాన్ ఉపవాసాలు ఉండరాదని వైద్యులు చెబుతున్నారు.

### 6 నెలల తర్వాత

ఆరు నెలల తర్వాత పిల్లలు కొద్దికొద్దిగా ఆహారం లేదా పానీయాలు లాంటివి తీసుకోవడం ప్రారంభిస్తారు. తల్లుల ఆరోగ్య పరిస్థితినిబట్టి రమజాన్ ఉపవాసాలు ఉండవచ్చు. రమజాన్ ఉపవాసాల వల్ల పాల స్వభావం, రుచి వంటి వాటిలో ఎటువంటి మార్పు ఉండదు. కావున ఎటువంటి సంకోచం లేకుండా ఉపవాసాలు ఉండవచ్చు.

ఉపవాసాలు పాటించాలనుకునే బాలింతలు సహరీ, ఇఫ్తారీలలో పాలను ఉత్పత్తి చేసే ఆహారాన్ని తీసుకోవాలి. పాలు ఇవ్వడానికి అధిక కేలరీలు అవసరం ఉంటుంది. కాబట్టి రోజు తీసుకునే ఆహారం కంటే 500 గ్రాములు సాధారణ మోతాదు కంటే కాస్త ఎక్కువగా తీసుకోవాలి.

- పండ్లు, కూరగాయలలో కాల్షియం అధికంగా ఉన్న పదార్థాలు తప్పకుండా తీసుకోవాలి. పౌష్టిక ఆహారమైన డ్రై ఫ్రూట్స్ లాంటివి తప్పనిసరిగా ఇఫ్తార్ తర్వాత తీసుకోవాలి.

- ఫ్రూట్ జ్యూస్, నీరు బాగా తాగాలి. వేసవికాలంలో డీహైడ్రేషన్ అయ్యే అవకాశాలు ఉంటాయి. కాబట్టి నీటిని 3-5 లీటర్ల వరకు తాగాలి. సాధ్యమైనంత వరకు ఎండల నుండి వేడి నుంచి తమను తాము కాపాడుకోవాలి.

- నిద్రలేమి లేకుండా చూసుకోవాలి. ఇంటి పనులకే పరిమితం కాకుండా విశ్రాంతి కూడా చాలా అవసరం.

- కాఫీ, టీలు తగ్గించాలి.

జాగ్రత్తగా డాక్టర్ల పర్యవేక్షణలో రమజాన్ ఉపవాసాలు ఈ క్రిందివారు ఉండవచ్చు.

- ➢ 35 సంవత్సరాలకు పైబడిన తల్లులు.
- ➢ మాటిమాటికి చిన్నచిన్న వ్యాధుల బారిన పడుతున్నవారు.
- ➢ బరువు తక్కువగా ఉన్నవారు.
- ➢ కవల పిల్లలు లేదా అంతకంటే ఎక్కువగా పిల్లలకు పాలిచ్చే తల్లులు.
- ➢ షుగర్ ఉన్నవారు.
- ➢ బీపీ ఉన్నవారు.
- ➢ కిడ్నీ వ్యాధులు ఉన్నవారు.
- ➢ గుండెకు సంబంధించిన వ్యాధులు ఉన్నవారు.

## ఉపవాసాన్ని ఎప్పుడు విడవవచ్చు?

తల్లికి పాలు తక్కువగా రావడం, దప్పికగా ఉండడం, నోరు ఎండిపోవడం, మూత్రం తక్కువగా రావటం (డార్క్ఎల్లో), నిస్సత్తువుగా ఉండడం, తల తిరగడం, మగతగా ఉన్న సమయంలో ఉపవాసాన్ని విడిచి ఏదైనా ఫ్రూట్ జ్యూస్, ఓఆర్ఎస్ లాంటివి తీసుకోవాలి. అర్ధగంట, గంట తర్వాత కూడా పరిస్థితి ఇలానే ఉంటే వెంటనే డాక్టర్ని సంప్రదించాలి.

శిశువు మాటిమాటికి ఏడవడం, బరువు తగ్గుతూ ఉండడం, పచ్చని రంగులో మలవిసర్జన చేస్తున్నప్పుడు తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలి.

ఉపవాసాలు పాటించని పాలిచ్చే తల్లులు తమకు దగ్గరలో ఉన్న ముఫ్తీల ద్వారా ఫిదియా గురించి తెలుసుకోవాలి.

## షుగర్ వ్యాధిగ్రస్తులు- రమజాన్ ఉపవాసాలు

భారతదేశంలో అత్యంత వేగంగా పెరుగుతున్న వ్యాధి మధుమేహం. ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకాల ప్రకారం భారత దేశం, చైనా, అమెరికాలలో ఈ వ్యాధి అత్యధికంగా ఉంది. షుగర్ వ్యాధిని పూర్తిగా తగ్గించే మందులు ఇప్పటివరకు రాలేదు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ జీవితాంతం షుగర్‌ను అదుపులో ఉంచుకోవచ్చు.

ప్రపంచ వ్యాప్తంగా 70% టైప్-2 డయాబెటిస్, 40% టైప్-1 డయాబెటిస్ వున్నవారు రమజాన్ ఉపవాసాలు పాటిస్తారని ఒక సర్వే తెలిపింది. మెడికల్ రీసెర్చ్ ప్రకారం అప్పుడప్పుడు ఉపవాసాలు పాటించేవారికి (Intermittent Fasting) మధుమేహ వ్యాధి వచ్చే అవకాశాలు చాలావరకు తగ్గిపోతాయని శాస్త్రవేత్తలు చెబుతు న్నారు. International Diabetic Federationలో దాదాపు 13 దేశాల డాక్టర్లు, శాస్త్రవేత్తలు, షుగర్ వ్యాధిగ్రస్తుల కోసం కొన్ని గైడ్‌లైన్స్ సూచించారు. ఈ గైడ్‌లైన్స్ ప్రకారం షుగర్ వ్యాధి ఉన్న వారిని మూడు కేటగిరీలలో విభజించారు.

1) హైరిస్క్ 2) మీడియమ్ రిస్క్ 3) లో రిస్క్

**1) కేటగిరి-1** : నిస్సందేహంగా రమజాన్ ఉపవాసాలు పాటించవచ్చు

1. గడిచిన మూడు నెలలో HbA1c వ్యాల్యూ 7కంటే తక్కువగా ఉన్నవారు.

2. రోజుకు రెండు లేదా మూడు మాత్రలు వాడేవారు

3. రోజుకు ఒక్కసారి కొద్దిగా మాత్రమే ఇన్సులిన్ తీసుకునేవారు

4. యవ్వనం ఉండి షుగర్ లెవల్స్ బాగా కంట్రోల్‌లో ఉన్నవారు

**2) కేటగిరి-2**

1. మందులతోపాటు ఇన్సులిన్ తీసుకునేవారు.

2. టైప్-1 డయాబెటిస్ ఉన్న పిల్లలు

3. షుగర్‌తోపాటు గుండెకు, కిడ్నీకి సంబంధించిన వ్యాధులు లేనివారు.

పై వారంతా లో రిస్క్, మీడియం రిస్క్ కోవలోకి వస్తారు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఉపవాసాలు ఉండవచ్చు.

**కేటగిరి-3**

1. గడిచిన మూడు నెలలో Severe Hypoglycemia అయి ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం వచ్చినవారు.

2. మాటిమాటికి షుగర్ లెవల్స్ తగ్గుతూ ఉండేవారు.

3. రోజుకి రెండు మూడు సార్లు ఇన్సులిన్ ఇంజక్షన్ తీసుకునేవారు.

4. షుగర్‌తోపాటు గుండె ఆపరేషన్లు అయినవారు.

5. షుగర్‌తోపాటు కిడ్నీ వ్యాధులు, డయాలసిస్‌పై ఉన్నవారు.

6. షుగర్ వ్యాధి ఉన్న గర్భవతులు

పైవారంతా హై రిస్క్ కేటగిరిలో వస్తారు. ఇటువంటి వారు ఉపవాసాలు పాటించరాదని చక్కెర వ్యాధి నిపుణులు చెబు తున్నారు.

మధుమేహం ఉన్నవాళ్లు ఉపవాసానికి ముందు కొన్ని నియమాలు పాటించాలి. ముఖ్యంగా రమజాన్ నెలకు ఒక నెల ముందే అంటే షాబాన్ నెలలో ఒకసారి డాక్టర్‌ని కలిసి కొన్ని రకాల టెస్ట్‌లు చేయించుకొని దానికి తగ్గట్టు మందులు వాడుతూ రమజాన్ ఉపవాసాలు ఉండవచ్చు. రమజాన్ ప్రారంభానికి ముందు HbA1c పరీక్షను తప్పనిసరిగా చేసుకోవాలి. ఈ పరీక్ష మీ శరీరంలో గత మూడు నెలలుగా ఉన్న చక్కెర స్థాయిని తెలియ జేస్తుంది. దీనిని చూసి రమజాన్‌లో ఉపవాసాలు ఉండవచ్చా లేదా అని ఒక అంచనా వేయవచ్చు.

➢ సహరీ చేసిన రెండు గంటల తర్వాత షుగర్ చెకప్ చేస్తే దాని లెవల్ 140 నుంచి 180 మధ్యలో ఉంటే షుగర్ పూర్తిగా కంట్రోల్‌లో ఉన్నట్టు. ఇంతకుమించి షుగర్ ఉన్నట్లు అయితే కంట్రోల్‌లో లేనట్టు. దానికి తగ్గట్టు ఇన్సులిన్ లేదా మందులు వాడవలసి ఉంటుంది.

➢ సహరీ చేసిన రెండు గంటల తర్వాత షుగర్ వ్యాల్యూ 110 లేదా 100 కన్నా తక్కువ ఉంటే సమయం గడిచే కొద్దీ శరీరంలో

చక్కెరస్థాయి మరింత తగ్గిపోయి హైపోగ్లైసిమియా అయ్యే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

➢ సహరీ ఆఖరి సమయం వరకు భోజనం చేసేలా ప్రయత్నించాలి. కొంతమంది రాత్రి 12 గంటలకు భోజనం చేసి ఉదయం సహరీ చేయకుండా షుగర్ టాబ్లెట్లు మింగి ఉపవాసం ఉండడానికి ప్రయత్నిస్తారు. ఇలా చేయడం వల్ల హైపోగ్లైసిమియా వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

➢ కేవలం షుగర్‌కు సంబంధించినదే కాకుండా కిడ్నీకి సంబంధించిన కిడ్నీ ఫంక్షనింగ్ పరీక్ష కూడా చేయించుకోవాలి. ఎందుకంటే ఉపవాస సమయంలో శరీరంలో కలిగే నీటి కొరత వల్ల మూత్ర పిండాల పనితీరుపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

➢ రమజాన్ ఉపవాసాలలో సహరీ, ఇఫ్తార్‌లో ఎక్కువగా తినటం వల్ల షుగర్ లెవల్స్ చాలామందికి పెరుగుతాయి. రమజాన్ నెల అంతా ఇలా షుగర్ పెరిగి ఉండడం వల్ల కిడ్నీ, కళ్లు, చర్మం, నరాల వ్యాధులు వంటి ఇతర సైడ్ ఎఫెక్ట్స్ కలుగుతాయి.

➢ ఉపవాసంలో ఉన్నప్పుడు షుగర్ టెస్ట్ చేయించుకుంటే ఉపవాసానికి భంగం కలుగుతుందని చాలామంది అపోహ పడుతుంటారు. ఇది నిజం కాదు. ఎన్ని సార్లైనా షుగర్ టెస్ట్ చేయించుకోవచ్చు.

## కొన్ని జాగ్రత్తలు

- సహరీ చేయకుండా ఉపవాసం ఉండరాదు.

- మొదట రెండు మూడు రోజులు కొద్దిగా ఇబ్బందిగా ఉన్నా, తర్వాత సాధారణ పరిస్థితి ఉంటుంది.

- ఒకవేళ ఉపవాసంలో ఉన్నప్పుడు తలనొప్పి రావడం, చల్లటి చెమటలు పట్టడం, తల తిరగడం, కన్ఫ్యూజన్‌గా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే గ్లూకోమీటర్ ద్వారా ఇంట్లోనే షుగర్ చెకప్ చేసుకోవాలి.

- ఒకవేళ ఆర్‌బీఎస్ 70 నుండి 90 లోపల ఉంటే, వెంటనే ఇతర పనులు మానేసి శరీరానికి విశ్రాంతినివ్వాలి. ఒక గంట తర్వాత మరోసారి షుగర్ టెస్ట్ చేసుకోవాలి.

- ఒకవేళ ఆర్‌బీఎస్ 70కి తక్కువగా ఉంటే వెంటనే ఏదైనా తీయటి పదార్థాలైన చక్కెర, చాక్లెట్, ఏదైనా ఫ్రూట్ డ్రింక్ వెంటనే తాగాలి. ఇఫ్తార్ సమయం దగ్గరగా ఉందనే భ్రమలో ఉండకూడదు.

- ఒకవేళ షుగర్ లెవల్ అకస్మాత్తుగా 300 కన్నా పైన ఉంటే మీ దగ్గర ఉన్న షుగర్ మందులను వాడవలసి ఉంటుంది. ఉపవాసంలో ఉన్నప్పుడు షుగర్ లెవల్స్ చాలా తగ్గిపోయినా లేక ఎక్కువగా పెరిగినా అటువంటి సమయంలో ఉపవాసాన్ని విడువవచ్చు. ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లు, ముఫ్తీలు ఏక కంఠంతో దీనిని సమర్థించారు.

- సహరీలో ఇన్సులిన్ ఇంజక్షన్ తీసుకునేవారు డాక్టర్ల సలహా మేరకు డోస్ తగ్గించుకోవాలి. ఇఫ్తార్‌లో పెంచుకోవచ్చు, కేవలం టాబ్లెట్ మాత్రమే వాడేవారు సహరీలో ఒకటి ఇఫ్తార్‌లో ఒకటి తీసుకోవాలి.

- ఎక్కువగా ఆయిల్, మసాలాలు ఉన్న పదార్థాలు వాడరాదు

- ఉపవాసాలు ఉండే షుగర్ రోగులు నీటిని బాగా తాగాలి. 2,3 లీటర్ల నీరు సహరీ, ఇఫ్తార్‌లో తాగేవిధంగా అలవాటు చేసుకోవాలి.

- షుగర్ ఉన్నప్పుడు మూత్రానికి సంబంధించిన ఇన్ఫెక్షన్ అయితే ఆలస్యం చేయకుండా వెంటనే దానికి మందులు వాడాలి.

- ఏదైనా గాయాలైతే దానిని తేలికగా తీసుకోరాదు. కొన్ని ఆంటిబయోటిక్ మందులు వాడవలసి ఉంటుంది.

- గర్భం దాల్చిన స్త్రీలు షుగర్ వ్యాధి ఉన్నట్లయితే మొదటి మూడు నెలలు, చివరి మూడు నెలలు రమజాన్ ఉపవాసాలు పాటించరాదు అని గైనకాలజిస్టులు చెబుతున్నారు. ఉపవాసం ఉండాలనుకుంటే తప్పనిసరిగా తమ డాక్టర్ల సలహా మేరకు ఉండవచ్చు.

- ఎక్కువగా వ్యాయామం చేయరాదు. సహరీలో తీసుకున్న ఆహారం మధ్యాహ్నం వరకు పూర్తిగా జీర్ణమైపోతుంది. తర్వాత శరీరంలో షుగర్ లెవల్ తగ్గుతూ వుంటాయి. కావున మధ్యాహ్నం నుంచి ఇఫ్తార్ మధ్యలో వ్యాయామం చేయరాదు.

| లో షుగర్ లక్షణాలు | హై షుగర్ లక్షణాలు |
|---|---|
| చెమటలు పట్టడం | విపరీతమైన దాహం |
| వణుకు | పలుమార్లు మూత్రానికి పోవటం |
| గుండె దడ | ఆకలి |
| చలిచలిగా ఉండటం | తల తిప్పడం |
| ఆకలి | వాంతి వచ్చినట్టు ఉండడం |
| నిస్సత్తుగా ఉండడం | బలహీనంగా కనబడటం |




**ముహమ్మద్ వహీదుద్దీన్**

**ఇస్లాం** ధర్మంలో పండుగలు రెండు మాత్రమే. 1) ఈదుల్ ఫిత్ర్ (రమజాన్) 2) ఈదుల్ అజ్‌హ (బక్రీద్). ధర్మబద్ధమైన పండుగలలో ఒకటైన ఈదుల్ ఫిత్ర్ పండుగ. ఫిత్రాల పండుగ అంటే బీదలకు ఫిత్రా దానం చెల్లించే పండుగ. ఇక ఫిత్రా దానం విలువ 2 కేజీల 500 గ్రాముల గోధుమల విలువకు సమానమైనదై ఉంటుంది. ఈ ఫిత్రా మధ్య తరగతి వారి నుండి మొదలుకొని కోటీశ్వరుల వరకు ఖచ్చితంగా చెల్లించవలసి ఉంటుంది.

ఈ ఫిత్రా దానం ఒకవైపు మనం చేసిన ఉపవాసాల్లో దొర్లిన చిన్న చిన్న లోటుపాట్లను పూడ్చుతుందని దైవప్రవక్త బోధన ద్వారా తెలుస్తుంది. మరోవైపు నిరుపేదలకు పండుగ సంతోషాన్ని పంచుతుంది. సంతోష సమయంలో బీదల స్థితిని గుర్తుచేసే విధానం ఇది. ముస్లింలలో పరస్పర దయ, సహకార గుణాలను పెంపొందిస్తుంది. హృదయాలను శుద్ధి చేస్తుంది. వారిలో పిసినారితనాన్ని అరికడుతుంది.

## ఈదుల్ ఫిత్ర్ పండుగ రోజు

ఈదుల్ ఫిత్ర్ పర్వదినాన ఉదయాన్నే 1) పొద్దున్నే నిద్ర లేవాలి 2) కాలకృత్యాలు తీర్చు కోవాలి 3) ఫజ్ర్ నమాజ్ ముందుగాని తర్వాత గాని తలంటు స్నానం చేయాలి 4) ఉన్నవాటిలో మంచి దుస్తులు ధరించాలి. 5) సువాసనలు పులుముకోవాలి 6) వ్యక్తిగత అలంకరణ చేసుకోవాలి 7) కళ్ళలో సుర్మా పెట్టుకోవాలి 8) ఈద్ నమాజ్ కంటే ముందే జకాత్, ఫిత్రా చెల్లించాలి 9) తీపి పదార్థాన్ని స్వీకరించాలి 10) 1,3,5,7 ఇలా బేసి సంఖ్యలో ఖర్జూరపు పండును తినాలి 11) ఈద్గా మైదానానికి పోయేటప్పుడు ఒక దారిన వెళ్ళాలి. 12) ఈద్గా నుండి వచ్చేటప్పుడు మరొక దారి గుండా రావాలి 13) ఈద్ నమాజ్‌కు పోతూ తక్బీర్‌ను మెల్లగా పలుకుతూ ముందుకు సాగాలి 14) కాలినడక ద్వారా వెళితే ఇంకా ఎంతో పుణ్యం 15) పండుగ నమాజ్ తర్వాత ఒకరినొకరు సలాం చెప్పుకోవాలి.

'తక్బీర్' అంటే 'అల్లాహ్ గొప్పవాడు, నిస్సందేహంగా అల్లాహ్‌యే గొప్పవాడు. ఆయన తప్ప మరే దేవుడు లేడు. అల్లాహ్ గొప్పవాడు. అల్లాహ్ గొప్పవాడు స్తోత్రం ఆయనకే"

పండుగ రోజున ఇస్లామీయ శాసనాంగం చూపిన పరిధులలో స్వాదిష్టమయిన ఆహారపదార్థాలు సేవించడం, శుభాకాంక్షలు తెలుపుకోవటం సంప్రదాయం.

ఈ పర్వదినాన ప్రత్యేకంగా ఇతర మతాలకు చెందిన సోదర మిత్రులను ఆహ్వానించి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటారు. వారిని విందులకు ఆహ్వానిస్తారు. తమ మిత్రులతో కలిసి విందు ఆరగించటంలోనే ముస్లిం మిత్రుడు సంతోషిస్తాడు. ఈ ఆత్మీయతా భావానికి అవధులు ఉండవు. అందువలన ఈ ఈదుల్ ఫిత్ర్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నది.

ఈద్ నమాజ్ బస్తీ లేక గ్రామం బయట ఒక బహిరంగ ప్రదేశంలో అంటే ఈద్గాహ్‌లో చేయటం సున్నత్. ప్రవక్త సంప్రదాయం. సౌకర్యం లేని పక్షంలో మస్జిద్‌లో కూడా పండుగ నమాజ్ చేయవచ్చు. ❖



# మద్యపానం సమాజానికి శాపం

- పోలంకి విజయభాస్కర్

**మన** దేశ భవిష్యత్ బాగుండాలంటే యువ జనాభా కూడా ఆరోగ్యంగా ఉండాలి. కానీ దేశానికి, జాతికి వెన్నుముకలైన యువత తన బాధ్యతను మరిచి ప్రవర్తిస్తోంది. యువత మద్యం మత్తులో ఇతర హానికర పదార్థాలను సేవించడం వల్ల వాళ్ల ఆరోగ్యాలు చిత్తవుతున్నాయి. చదువులో రాణించాల్సిన సమయంలో చదువును నిర్లక్ష్యం చేస్తూ... సినిమాలు, షికార్లు, మొబైల్ ఫోన్‌తో ఆటల్లో తమ విలువైన సమయాన్ని వృధా చేస్తున్నారు. కొండంత ఆశలు, మహోన్నత ఆశయాలతో బంగారు కలలుగన్న తల్లిదండ్రులకు మనోవేదనను మిగులుస్తున్నారు. మంచి గుణగణాలు, నైతిక విలువలు, మంచి ప్రవర్తనతో ఉన్నత స్థానాలను అధిరోహించాల్సిన యువత వ్యసనాలకు బానిసై శరీరాన్ని బలహీనపర్చుకుంటుంది. మద్యం, మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు.

నేడు మన దేశంలో నీళ్లకైనా కరువు ఉందేమో గాని సారాయి, మద్యానికి కొదవలేదు. ఎక్కడ పడితే అక్కడ మద్యం ఏరులై పారుతోంది. పట్టణాల నుండి మారుమూల ప్రాంతాల వరకు ఎక్కడ చూసినా మద్యం మనకు కనబడుతుంది. ఆడ, మగ అనే బేధం లేకుండా అందరూ తాగేస్తున్నారు. కుల మతాలకు అతీతంగా అమ్ముడైపోతోంది. మద్యం తాగితే ఊబిలో పడినట్టే. ఇది ఒక వ్యసనంగా మారితే... శక్తి సామర్థ్యాలను హరిస్తుంది. కాలేయాన్ని తినివేస్తుంది. గుండెను బలహీనపరుస్తుంది. రక్తాన్ని విషపూరితం చేస్తుంది. మద్యం తాగిన వ్యక్తి తన పర అనే తేడా లేకుండా వింత పశువులా ప్రవర్తిస్తాడు. తన భార్య ఎవరో, తల్లి ఎవరో, కూతురు ఎవరో అనే విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతాడు. పశు లక్షణాలు అతనిలో కానవస్తాయి. ఆ మత్తులో ఎంతటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారో పరిశీలిస్తే, ఆవేదన కాదు... ఆందోళన కలుగుతోంది.

తాగిన మత్తులో కన్న తండ్రే రెండేళ్ళ కుమారుడిని నేలకేసి కొట్టి చంపాడు. తాగుడుకు డబ్బులివ్వలేదని కట్టుకున్న ఇల్లాలినే మట్టుబెట్టాడు ఒక కిరాతకుడు.

ఒకటి, రెండు కాదు.. దేశవ్యాప్తంగా ఎన్నో నేరాలకు, ఘోరాలకు మద్యం మత్తే కారణమవుతున్నది. మానవ సంబంధాలు, మమతానురాగాలను కూడా మద్యం తుంచి వేస్తున్నది. ఇక రోడ్డు ప్రమాదాలకు అంతే లేకుండా పోతున్నది. రోడ్డు ప్రమాదాల్లో మరణించేవారి, క్షతగాత్రులయ్యేవారి సంఖ్య అంతకంతకు పెరిగిపోతున్నది. అందులో అధిక శాతం ప్రమాదాలు అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడుపుతుండడం వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయనేది కాదనలేని వాస్తవం. మద్యం అనేది ప్రభుత్వాలకు ప్రధాన ఆదాయాల్లో ఒకటిగా మారిపోయింది. ఈ పరిస్థితుల్లో సంపూర్ణ మద్య నిషేధం విధించడం అనేది సాధ్యం కాదనేది ఆర్థిక నిపుణుల వాదన. ఆదాయం కోసం ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమో విజ్ఞతతో ఆలోచించాలి.

ఇస్లాం చరిత్రలో మద్యనిషేధం గురించిన దైవాదేశాలు వచ్చినప్పుడు మదీనా నగర వీధుల్లో మద్యం కాలువలు ప్రవహించాయి. ఇండ్లలో ఉన్న మద్యాన్ని తీసుకొచ్చి స్వచ్ఛంధంగా బయట పారేశారు. మద్యానికి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే నైతిక, ఆధ్యాత్మిక ప్రవక్త బోధనలు నేటి సమాజానికి ఎంతైనా అవసరం.

### తల్లిదండ్రులు ఆదర్శంగా ఎలా ఉండాలంటే...

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 15-19 మధ్య వయసున్న యువతలో ప్రతి నలుగురిలో ఒకరు మద్యం ఆల్కహాల్ సేవిస్తున్నారు. యువత అధికంగా మద్యం మహమ్మారి బారిన పడుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు కూడా తమకున్న చెడు అలవాట్లను మార్చుకుని పిల్లలకు ఆదర్శంగా ఉండాలి. కుటుంబంలో వ్యసనాలకు బానిసై ఉంటే ఆ ప్రభావం ఇంట్లో ఉండే పిల్లలపై ఖచ్చితంగా చూపుతుంది. అలాంటి పరిస్థితుల్లో వారి మనసు నిగ్రహంగా ఉండలేక చెడు వ్యసనాలకు అలవాటు పడతారు. రోజూ కుటుంబంలో గొడవలు, ఘర్షణలు చోటు చేసుకోవడంతో వాటి నుంచి బయట పడేందుకు కొత్త మార్గాలను అనుకరించే క్రమంలో మత్తుకు బానిసయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. పిల్లల నడవడిక, వారి అలవాట్లు, స్నేహాలు, చదువు మొదలైన వాటిని దగ్గరుండి పర్యవేక్షించే బాధ్యత తల్లిదండ్రులదే. ఎందుకంటే... మొదట కళాశాల, తర్వాత ఇంట్లో యువత ఎక్కువగా గడిపేది. ప్రస్తుతం తల్లిదండ్రులు ఇద్దరూ జాబ్‌లు చేస్తుండడంతో పిల్లలతో గడిపే సమయం తగ్గిపోతోంది. అందువల్ల పిల్లలపై పర్యవేక్షణ కరువవుతున్నది. ఇతర పిల్లలతో పోల్చుతూ సూటిపోటి మాటలతో పిల్లలను వేధించడం మంచిది కాదు. ఆ మాటలు పిల్లల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కాబట్టి తమ పిల్లల నడవడిక, వ్యవహార తీరును గమనిస్తూ... స్నేహితుడిలా మెలుగుతూ వాళ్ళు చెడు దారిలోకి జారిపోకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దయచేసి ఇప్పటికైనా మేల్కొండి... మద్యపానాన్ని మీ జీవితాల్లో నిషేధించుకోండి.

# ప్రకాశం జిల్లా కంభం పట్టణంలో నిత్యావసరాల పంపిణీ



ప్రకాశం జిల్లా కంభం పట్టణంలో జమాఅతె ఇస్లామీ హింద్ స్థానిక శాఖ సంఘసేవా విభాగము ఆధ్వర్యంలో 2024 మార్చి 24వ తేదీ ఆదివారం అర్హులైన నిరుపేద 100 కుటుంబాలకు బియ్యం, కంది పప్పు, నూనె, చక్కెర, సేమియాలు, చింతపండు వంటి పది రకాల నిత్యావసర వస్తువులను ఇంటింటికి వెళ్లి అందచేశారు. ఈ కార్యక్రమాన్ని గత 10 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని సంఘసేవా విభాగ బాధ్యులు ముహమ్మద్ రఫీ పేర్కొన్నారు.

"విశ్వాసం, నమాజ్, జకాత్, ఉపవాసం, హజ్‌లు ఇస్లాం అయిదు మూల స్తంభాలు. వీటిలో "జకాత్" ధనానికి సంబంధించిన ఆరాధన. ఇది హి.శ. 2వ సంవత్సరంలో విధిగావించబడింది. "నమాజ్ చేయండి, జకాత్ ఇవ్వండి" అని దివ్య ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల ప్రస్తావించబడింది. ఆర్థిక స్థోమత గల ప్రతి వ్యక్తి ప్రతి సంవత్సరం తన సంపద నుండి రెండున్నర శాతం జకాత్ తీసి, పేద సాదలకు, సంస్థలకు దానం చేయటం విధి (ఫర్జ్) గావించబడింది" అని ముఫ్తీ యాసిన్ గారు అన్నారు.

జకాత్‌ను సామూహికంగా వసూలు చేసి, సామూహికంగా ఖర్చు చేయడంలో తోడ్పాటు అందిస్తున్న జమాత్ సభ్యులు కార్యకర్తలు మరియు పెద్దలకు జమాఅతె ఇస్లామీ హింద్ స్థానిక బాధ్యులు ముహమ్మద్ గౌస్ ఖాన్ ధన్యవాదాలు తెలియజేశారు.

Education Co-ordinater SIO AP చాంద్ బాషా, మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ బాధ్యులు షేక్ కరిముల్లా, AB function hall అధినేత అయ్యూబ్ ఖాన్, షేక్ అబ్దుల్ కలాం, రసూల్ బేగ్, సయ్యద్ అబ్దుల్ జలీల్, జమాఅతె ఇస్లామీ హింద్ సభ్యులు ఆసిఫ్ ఖాన్, అబ్దుల్లాఖాన్, ఫిరోజ్ ఖాన్, SIO సభ్యులు వసీం, బాజిద్, సాజిద్ ఖాన్, రఖీబ్, నసీర్, ఆదిల్, ఆఖిబ్, సాఖిబ్ మరియు మస్జిద్ ఏ రహమానియా జమాత్ సభ్యులు పాల్గొన్నారు.

**రిపోర్టింగ్ : ముహమ్మద్ గౌస్‌ఖాన్, కంభం**




**రమజాన్** మాసం మొట్టమొదట భక్తునికి సంకల్పాన్ని పరిశుద్ధపరచుకోవలసినదిగా ఆజ్ఞాపిస్తుంది. ఎందుకంటే సంకల్పం మనిషిని చైతన్యపరుస్తుంది. చైతన్యం కలిగినప్పుడే మనిషి కృషి చెయ్యడానికి సిద్ధమవుతాడు. కనుక దైవారాధనలను ఆచరించడానికి నిజమైన గట్టి సంకల్పం అవసరం ఎంతైనా ఉంటుంది. దాని ఆధారంగానే ఆచరణలకు దైవామోదం లభిస్తుంది. కనుక రమజాన్ మాసంలో భక్తుడు చిత్తశుద్ధితో కూడిన సంకల్పం చేసుకోవలసి ఉంటుంది. ఎందుకంటే దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: మనిషి చేసే ఆచరణలన్నీ అతని సంకల్పంపైనే ఆధారపడి ఉంటాయి.

రెండోది మనిషి రమజాన్ మాసంలో ఉపవాస వ్రతాన్ని పాటిస్తాడు. ఆ ఉపవాసవ్రతంలో దైవభక్తి, దైవభయం, కృతజ్ఞతా భావం, సహనం, కోరికలపై అదుపు చెడులకు దూరం, సత్కార్యాలకు సామీప్యం, సమయపాలన లాంటి ఎన్నో సుగుణాలను భక్తుడు అలవరచుకుంటాడు. దైవ అవిధేయతకు పాల్పడకుండా తనను తాను రక్షించుకుంటాడు. అన్యాయాలకు, అక్రమాలకు దూరంగా ఉంటాడు. స్వీయ నియంత్రణను పొందుతాడు. సమయాన్ని సద్వినియోగపరచుకోవటం నేర్చుకుంటాడు. ఇవన్నీ మనిషి జీవితానికి కావలసిన రోజువారి సుగుణాలు.

మూడోది, దివ్య ఖుర్‌ఆన్‌తో భక్తుని సంబంధం బలపడుతుంది. రమజాన్ మాసానికి దివ్య ఖుర్‌ఆన్‌కు అవినాభావ సంబంధం ఉంది. కనుక ఖుర్‌ఆన్ గ్రంథం మొత్తాన్ని భక్తుడు ఈ మాసంలో ఒక్కసారైనా పూర్తిగా పఠించటానికి ప్రయత్నిస్తాడు. ఖుర్‌ఆన్ గ్రంథం అరబీ భాషలో ఉన్నప్పటికీ, అరబీ భాష భక్తునికి అర్థంకాక పోయినప్పటికీ దాని అర్థాన్ని తనకు వచ్చిన భాషలో చదివి అర్థం చేసుకోవటానికి, ఆచరించటానికి ప్రయత్నిస్తాడు.

నాలుగోది, తరావీహ్ నమాజ్‌ను భక్తుడు ఈ మాసంలో క్రమం తప్పకుండా చెయ్యటానికి ప్రయత్నిస్తాడు. ఈ ఆరాధన అదనపు ఆరాధన అయినప్పటికీ దానినుంచి తప్పించుకోవటానికి ప్రయత్నించడు. ఈ నమాజులో ఖుర్‌ఆన్ గ్రంథం మొత్తాన్ని మనోహరమైన రీతిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలకించే ఏర్పాట్లు చేసుకుంటాడు. చెవులలో మారుమ్రోగే పారాయణం ద్వారా మనశ్శాంతి పొందటానికి కృషి చేస్తాడు. దీనిద్వారా తనకున్న బాధలు, కష్టాలు అన్నీ మరిచిపోతాడు. ఈ దివ్య ఔషధం అతనికి సంవత్సరమంతా సుఖంగా ఉండటానికి, మనశ్శాంతిని పొందటానికి దోహదపడుతుంది.

ఐదవది, ఈ రమజాన్ మాసంలో సత్కార్యాల ప్రస్తావన రాగానే భక్తుడు ఆతృతగా వాటిని పొందే ప్రయత్నం చేస్తాడు. వాటిలో భాగస్వామ్యాన్ని ఆశిస్తాడు. ఎందుకంటే అల్లాహ్ ఈ మాసంలో ఒక్క పుణ్యానికి డెబ్బై రెట్లు అధిక పుణ్యాన్ని ప్రసాదిస్తానని వాగ్దానం

చేశాడు. కనుక ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగపరచుకోవటానికి ఉవ్విళ్ళూరుతాడు. ఎందుకంటే, ఇతర మాసాలలో ఒక్క సత్కార్యానికి ఒక్క పుణ్యమే లభిస్తుంది. రమజాన్ మాసం పుణ్యాలకు చేరుకోవాలంటే ఇతర మాసాలలో అత్యధికంగా శ్రమించవలసి ఉంటుంది. అప్పుడు కూడా ఆ లోటు భర్తీ కాదు.

ఆరోది, రాత్రుల జాగారం. ఖుర్ఆన్ గ్రంథం అవతరించిన మాసం రమజాన్ మాసంలోని ఒక రాత్రి కాబట్టి ఆ రాత్రి జాగారం చేసి ఆరాధన చెయ్యటం వెయ్యి మాసాలలో ఆరాధన చేసినదానితో సమానం కాబట్టి ఈ సువర్ణావకాశాన్ని ఎలాగైనా పొందాలని కాంక్షిస్తాడు. ఇంకా ఆ రాత్రిని అన్వేషించవలసి ఉన్నప్పటికీ ఐదు బేసిరాత్రులు జాగారం చేసి ఆరాధనలు చెయ్యటానికి కృషి చేస్తాడు.

ఏడవది, అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తాడు. జకాత్ దానం స్థితిమంతులపై విధిగా చెయ్యబడింది. జకాత్ దానాన్ని చెల్లిస్తే ధనం పరిశుభ్రమవుతుంది. మరింత వృద్ధి చెందుతుంది. జకాత్ దానాన్ని చెల్లించేవారికి పరలోకంలో కూడా మంచి ప్రతిఫలం లభిస్తుంది. చెల్లించని వారి సంపదలో శుభాలు అవతరించవు. ఆ సంపద పరిశుద్ధతకు నోచుకోదు. ఇంకా పరలోకంలో కఠినాతి కఠినమైన శిక్ష ఇవ్వబడుతుంది. ఈ విషయాలను గ్రహించిన భక్తుడు తన వద్ద ఉన్న బంగారాన్ని మరీ తూచి పైకాన్ని సరిగ్గా లెక్క వేసి ఆ జకాత్ దానాన్ని నిరుపేదలకు, అగత్యపరుల కోసం, వితంతువుల కోసం, ధర్మ పురోగతి కోసం ఖర్చుపెడతాడు. అతను ఈ విధంగా చేసిన ఖర్చుకు అల్లాహ్ తనకు ఇచ్చిన రుణంగా భావించి తిరిగి అల్లాహ్ చెల్లిస్తాడన్న విషయాన్ని పూర్తిగా నమ్ముతాడు.

ఎనిమిదవది, ఏతెకాఫ్. భక్తుడు ఈ మాసంలోని చివరి పదిరోజుల్లో ప్రాపంచిక కార్యకలాపాలను, భార్యాపిల్లలను విడిచిపెట్టి మస్జిద్‌లో ఏకాంతంగా కూర్చొని దైవధ్యానంలో నిమగ్నమైపోతాడు. ఇది మహోన్నతమైన ధార్మిక కార్యం. ఇరవై నాలుగు గంటలు నేను కేవలం నీ దాసుణ్ణే. నీ కోసమే జీవిస్తాను, నీ కోసమే మరణిస్తాను, నీ ఆజ్ఞలనే పాలిస్తాను, నిన్నే ఆరాధిస్తాను అని కేవలం నోటితోనే కాక ఆచరణాత్మకంగా సాక్ష్యమిస్తాడు. అటువంటి దాసుణ్ణి అల్లాహ్ అమితంగా ప్రేమిస్తాడు. ఈ పది రోజులు అతని నరనరాల్లో ఆధ్యాత్మికత జీర్ణించుకుపోయి ఉంటుంది.

తొమ్మిదవది, దైవ నామస్మరణ. ఉపవాస వ్రతంలో ఉన్నప్పుడు చాడీలు చెప్పటం, దుర్భాషలాడటం, కయ్యానికి కాలు దువ్వటం నిషిద్ధం. ఈ దుష్కార్యాల నుండి తనను తాను కాపాడుకోవటానికి మంచి మార్గం దైవనామస్మరణను జపించటం. దీని ప్రతిఫలం కూడా ఎన్నో రెట్లు పెరిగిపోతుంది. కాబట్టి ప్రతి క్షణం భక్తుడు దైవనామస్మరణలోనే లీనమైపోతాడు. దైవనామస్మరణ చేసే భక్తుణ్ణి అల్లాహ్ అమితంగా ఇష్టపడతాడు. దానిద్వారా అతనికి ఇహలోకంలో మనశ్శాంతిని, పరలోకంలో ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

పదవది, దుఆ. ఉపవాసవ్రతాన్ని పాటిస్తున్న భక్తుడు దైవభక్తి పరాయణుడుగా రూపొందుతాడు. భయభక్తులు గల వ్యక్తిగా అలరారుతాడు. దీనికారణంగా అతను దైవ సామీప్యతను చూరగొంటాడు. ఈ విధంగా దైవ సామీప్యతను పొందిన వ్యక్తి ఏదైనా కావాలని కోరినప్పుడు అంటే దుఆ చేసినప్పుడు అతని పట్ల సంతుష్టుడైన అల్లాహ్ వెంటనే అతనికి ప్రసాదిస్తాడు. భక్తుడు ఎల్లవేళలా అల్లాహ్ ముందు చెయ్యి చాచి అర్థించటాన్ని అధికంగా ఇష్టపడతాడు. ఎందుకంటే భక్తుడు ఎల్లప్పుడూ అగత్యపరుడే. ఏదో ఒక అవసరం అతనికి కలుగుతూనే ఉంటుంది. అల్లాహ్ సర్వలోకాలకు, సర్వశక్తులకు ప్రభువు. కాబట్టి ఆయన తన భక్తునికి ఇవ్వదలిస్తే ఆపేవాడెవ్వడూ లేడు.


**ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్**

**భారతదేశపు మొట్టమొదటి ఇస్లామిక్ కాల్ సెంటర్.**

తెలుగు - హిందీ - ఇంగ్లీష్ - తమిళం - కన్నడ - మరాఠీ - బెంగాలీ

భాషలలో సేవలందిస్తుంది. ఇస్లామ్‌కు సంబంధించిన అపోహలు, అపార్థాలను దూరంచేస్తూ, ఉదయం 8గం. నుండి రాత్రి 12గం. వరకు ఇస్లాం యొక్క సరియైన పరిజ్ఞానాన్ని అందిస్తుంది.

ఇస్లాంకు సంబంధించిన సందేహాల సమాధానం కోసం,

**ఉచితంగా దివ్యఖుర్ఆన్ కోసం సంప్రదించండి:**

**1800 572 3000**

# కేన్సర్‌ను నివారించే రమజాన్ ఉపవాసాలు



- పర్వీన్ సుల్తానా

**ఉపవాసం** శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను అందిస్తుంది. ఊపిరితిత్తులు, రొమ్ము, కాలేయం, కొలొరెక్టల్ క్యాన్సర్ల వంటి కొన్ని రకాల క్యాన్సర్లను ఉపవాసం నిరోధిస్తుందని పరిశోధనల ద్వారా తెలుస్తోంది.

ఉపవాస సమయంలో ఊపిరితిత్తుల పనితీరు, శ్వాసకోశ ఆరోగ్యం మెరుగుపడతాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది. అనేక అధ్యయనాలు రమజాన్ ఉపవాసం వల్ల రొమ్ము క్యాన్సర్ ప్రమాదం తగ్గుతున్నట్లు తెలియజేశాయి. ఉదాహరణకు, ఉపవాసం ఇన్సులిన్ స్థాయిలలో మార్పులకు దారితీస్తుంది, ఇది రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని ప్రభావితం చేస్తుంది.

కొలొరెక్టల్ క్యాన్సర్ పై రమజాన్ ఉపవాసం ప్రభావాన్ని చూస్తే, ఉపవాసం వల్ల జీర్ణాశయ ఆరోగ్యంపై ప్రయోజనకరమైన ప్రభావం ఉంటుందని తెలిసింది. కడుపులో మంటను తగ్గించడం, గట్ బాక్టీరియా కూర్పును, ప్రేగు పనితీరును మెరుగుపరచడం జరుగుతుంది. దీనివల్ల కొలొరెక్టల్ క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది.

ఉపవాసం ద్వారా కొన్ని రకాల క్యాన్సర్‌లను నిరోధించడానికి కారణాల్లో ఒకటి గ్లూకోజ్ లభ్యత తగ్గడం, మెరుగైన ఇన్సులిన్ సెన్సిటివిటీ, సెల్యులార్ పునరుత్పత్తి, ఆటోఫాగి (అనవసరమైన శరీర భాగాన్ని తొలగించడం) మొదలైనవి ఉన్నాయి.

క్యాన్సర్ వ్యాపించడంలో గ్లూకోజ్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. గ్లూకోజ్ లభ్యతను తగ్గించడం ద్వారా ఉపవాసం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్యాన్సర్ కణాలు సాధారణ శరీర కణాలకన్నా ఎక్కువగా గ్లూకోజ్ గ్రహిస్తుంటాయి. ఉపవాస సమయంలో, రక్తప్రవాహంలో గ్లూకోజ్ తగ్గిపోతుంది. ఇతర శక్తి వనరులను శరీరం ఉపయోగించుకోవడం ప్రారంభిస్తుంది. ఈ మార్పు క్యాన్సర్ కణాలను ప్రభావితం చేస్తుంది

ప్రొఫెసర్ యోషినోరి ఓహ్సుమీకి 2016లో ఆటోఫాగి మెకానిజమ్స్, ఉపవాసంతో దాని సంబంధాన్ని కనుగొన్నారు. ఆయనకు ఫిజియాలజీ, మెడిసిన్‌లో నోబెల్ బహుమతి లభించింది,.

ఉపవాసం ఆటోఫాగీని ప్రేరేపిస్తుంది, దీనివల్ల కణాలలోని హానికరమైన భాగాలు తొలగిపోతాయి. ఫలితంగా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది, జీవితకాలం పెరుగుతుంది. ఉపవాసం ద్వారా ప్రేరేపించబడిన ఆటోఫాగి శరీరంలో దీర్ఘకాలిక మంటను కూడా తగ్గిస్తుంది, ఇది క్యాన్సర్ అభివృద్ధికి కారణాలలో ఒకటి.

ఉపవాసం శరీరాన్ని ప్రక్షాళనం చేస్తుంది. విషపదార్థాలు తొలగిస్తుంది. జీర్ణ వ్యవస్థకు విశ్రాంతిని ఇస్తుంది. మొత్తంమీద, రమజాన్ ఉపవాసం శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు కలిగి ఉంది. ❖

# భారతదేశ ముస్లిం సామాజిక, మత సంస్కర్తలు

- ముహమ్మద్ అజ్గర్ అలీ

1857లో మొదటి భారత స్వాతంత్ర్య ఉద్యమం విఫలమైన తరువాత ముస్లిములు నిరాశాజనకమైన కాలాన్ని ఎదుర్కొన్నారు. ముస్లింలు తాము ఓడిపోయామని భావించారు. బ్రిటీష్ వారు ముస్లిం ఉలమాలపై నిర్బంధాలు విధించారు. ముస్లిం సమాజాన్ని అన్ని విధాలుగా హింసించారు. విప్లవం ముగిసిన తరువాత ముస్లింలు క్రియాశీల రాజకీయాల నుండి వైదొలగాలని నిర్ణయించు కున్నారు. ముస్లిం సమాజం విద్యా అభ్యున్నతిపై దృష్టి పెట్టారు.

## సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ (1817 -1898)

ముస్లింలలో నిజమైన సంస్కర్తగా ఉద్భవించిన వ్యక్తి సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్. ముస్లింలు ఆంగ్లేయులతో విరోధం పెట్టుకోవద్దని, ఆంగ్ల విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగ రంగంలోకి రావాలని సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ అభిప్రాయపడ్డారు. ముస్లింలను ఆధునిక విద్యతో తీర్చిదిద్దేందుకు అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాల యాన్ని స్థాపించాడు. ప్రారంభంలో సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఆలోచనలు ప్రయత్నాలు  ఫలించాయి. అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం అనేక మంది పండితులను, శాస్త్రవేత్తలను, రాజకీయ వేత్తలను, బ్యూరోక్రాట్‌లను ఉత్పత్తి చేసింది.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ భారతదేశపు గొప్ప ముస్లిం విద్యా సంస్కర్తగా పరిగణించబడ్డాడు. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ 21వ శతాబ్దంలో కూడా భారతదేశంలోని ముస్లింలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాడు.

## సయ్యద్ అమీర్ అలీ (1849-1928)

సయ్యద్ అమీర్ అలీ భారతదేశ సామాజిక, విద్యా సంస్కర్త. సయ్యద్ అమీర్ అలీ 1849లో ఒడిశాలోని కటక్‌లో జన్మించారు. 1928లో లండన్‌లో మరణించారు. ముస్లింలు విద్యలో పురోగతి ద్వారానే తాము కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందగలరని అభిప్రాయపడ్డారు.

1857 తిరుగుబాటు విఫలమైన తరువాత, ఆంగ్లేయులు ముస్లిం లను మాత్రమే కాకుండా ఇస్లాం పట్ల కూడా చెడు దృష్టి ప్రదర్శించారు. ముస్లింలు ఆత్మవిశ్వాసం కోల్పోయారు. ఈ పరిస్థితిలో, సయ్యద్ అమీర్ అలీ, ప్రవక్త (స) కుమార్తె హజ్రత్ ఫాతిమా(ర) వరకు ప్రవక్త(స) తన వంశాన్ని గుర్తించి, ప్రపంచ సమాజం దృష్టిలో ఇస్లాం ప్రతిష్టను కాపాడటానికి ఆంగ్లంలో అనేక పుస్తకాలను రచించారు. ఇస్లాం హేతుబద్ధమైన మతమని నిరూపించే ప్రయత్నం చేశారు.

1873లో, సయ్యద్ అమీర్ అలీ "ఎ క్రిటికల్ ఎగ్జామినేషన్ ఆఫ్ ది లైఫ్ అండ్ టీచింగ్స్ ఆఫ్ మొహమ్మద్" అనే పుస్తకాన్ని రాశారు. 1877లో, సయ్యద్ అమీర్ అలీ ముస్లింలలో రాజకీయ జాగృతిని తీసుకురావడానికి జాతీయ మహమ్మదీయ సంఘాన్ని National Mohammedan Association స్థాపించారు. ఈ విషయంలో, ముస్లింలను రాజకీయాల నుండి దూరం చేయాలనే సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఆలోచనను సయ్యద్ అమీర్ అలీ వ్యతిరేకించారు.

1891లో, సయ్యద్ అమీర్ అలీ పాశ్చాత్య దేశాలలో ఇస్లాం గురించి సరైన అవగాహన కల్పించేందుకు "ది స్పిరిట్ ఆఫ్ ఇస్లాం" అనే పుస్తకాన్ని రాశారు.

"ముస్లిం పర్సనల్ లా ఆఫ్ ఇండియా" సంకలనంలో సయ్యద్ అమీర్ అలీ కీలకపాత్ర పోషించారు. సయ్యద్ అమీర్ అలీ న్యాయ నిపుణుడు. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి.

సయ్యద్ అమీర్ అలీ "భారతదేశంలో మహిళలకు సంబంధించిన లీగల్ పొజిషన్" అనే పుస్తకాన్ని కూడా రాశారు. సయ్యద్ అమీర్ అలీ ముస్లిం స్త్రీల స్థానంలో సామాజిక మార్పులను సమర్థించారు. ముస్లిం స్త్రీల పట్ల ముస్లిం పురుషుల దృక్పథంలో మార్పు తీసుకు రావాలని కోరుకున్నారు. బహుభార్యత్వాన్ని వ్యతిరేకించారు.

## వక్కం ముహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ మౌల్వీ (1873 - 1932)

19వ శతాబ్దపు చివరి భాగంలో ఉత్తర భారతదేశంలోని ముస్లిం లలో సంస్కరణలు తీసుకురావడానికి అనేక మంది సంఘ సంస్కర్తలు, కార్యకర్తలు కృషి చేస్తున్నప్పుడు వక్కం మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ మౌల్వీ అనే పండితులు, సంస్కర్త ముస్లింలలో ఆధునిక విద్యను ప్రోత్సహించడానికి, వారిలో రాజకీయ అవగాహన గురించి నిశ్శబ్దంగా కృషి చేస్తున్నారు.

వక్కం మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ మౌల్వీ మలయాళం, అరబిక్, ఉర్దూ, పర్షియన్, ఆంగ్ల భాషలలో పండితులు. వక్కం మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ మౌల్వీ 'స్వదేశాభిమాని' అనే మలయాళ వార్తా పత్రికను ప్రచురించారు. ముస్లిం, దీపిక అనే పత్రికలను ప్రచురించారు. అంతేకాకుండా అల్ ఇస్లాం అనే మలయాళ అరబిక్ పత్రికను కూడా వక్కం మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ మౌల్వీ ప్రచురించారు.

వక్కం మహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ మౌల్వీ ఉర్దూ, అరబిక్, పర్షియన్, ఇంగ్లీషు నుండి అనేక పుస్తకాలను అనువదించడం ద్వారా మలయాళంలో ఇస్లామిక్ సాహిత్యానికి సహకరించారు. ముఖ్యంగా, వక్కం ముహమ్మద్ అబ్దుల్ ఖాదిర్ మౌల్వీ అల్ గజాలీ 'కీమ్యా-ఎ-సాదత్'ను మలయాళంలో అనువదించారు. వక్కమ్ మౌల్వీని కేరళలో సామాజిక, మత సంస్కరణల పితామహుడిగా పిలుస్తారు.

# షవ్వాల్ మాసంలో మరో ఆరు రోజుల ఉపవాసం

**- ముహమ్మద్ వహీదుద్దీన్**

**పవిత్ర** రమజాన్ నెలలో చేసినట్లే షవ్వాల్ నెలలో కూడా ఆరు రోజులపాటు ఉపవాస దీక్షను పాటించే సంప్రదాయం ఉంది. దీనివల్ల ఉపవాస ఫలితం పదింతలు అవుతుంది.

రమజాన్ మాసంలో ముప్పై రోజులు చేసే ఉపవాసం 300 రోజులకు అంటే 10 నెలలకు సమానం. షవ్వాల్ మాసంలో కొనసాగించే 6 రోజుల ఉపవాసం 60 రోజులకు, అంటే 2 నెలలకు సమానం. ఈ 36 రోజుల ఉపవాసం శ్రద్ధ, నిష్ఠలతో ఆచరిస్తే 12 నెలలు అంటే ఏడాది అంతా ఉపవాసం చేసిన ఫలితం లభిస్తుంది అని అంతిమ మహాప్రవక్త(స) బోధించారు.

రమజాన్ ఉపవాసాలను ఎలాంటి ఆటంకం లేకుండా చేయగలిగే శక్తిని, భక్తినీ ప్రసాదించినందుకు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపడం దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. అల్లాహ్‌కు నిజమైన కృతజ్ఞతాపూర్వక సేవకుడిగా తనను తాను ప్రకటించుకునే ఒక అవకాశం. ఆయన పట్ల ఉన్న చిత్తశుద్ధికి, స్వీయ సమర్పణకూ ఒక సంకేతం.

అయితే షవ్వాల్‌లో ఆరు రోజుల ఉపవాసం అనేది తప్పనిసరి కాదు. సహేతుకమైన, న్యాయబద్ధమైన కారణంగా ఉన్నప్పుడు దాని నుంచి మినహాయింపు ఉంటుంది. షవ్వాల్ ఉపవాసాలను ఈద్ పండుగ మరునాటి నుంచో, ఆ తరువాత రోజు నుంచో ప్రారంభించడం ఉత్తమం. వీటిని వరుసగా ఆరు రోజులు పాటిస్తే చాలా మంచిది. అయితే కారణాంతరాల వల్ల విడివిడిగా రోజులు అంటే విరామం ఇచ్చి కూడా షవ్వాల్ నెల ముగిసేలోగా చేయవచ్చు.

కాని ఆలస్యం చేసిన కొద్దీ ఏమైనా ఆటంకాలు ఎదురు కావచ్చు. కాబట్టి మంచి పనులను వీలైనంత త్వరగా క్రమబద్ధంగా, నిరంతరాయంగా చేయాలని పెద్దల మాట.

షవ్వాల్ నెలలో ఎవరయితే ఆరు ఉపవాసాలు పాటిస్తారో వారు ఏడాదంతా ఉపవాసంలో ఉన్నట్టేనని, అప్పుడే తల్లి గర్భం నుంచి బయటికి వచ్చినంత పవిత్రుడవుతాడని స్వయంగా దైవప్రవక్త ముహమ్మద్(స) పేర్కొన్నారు.

రమజాన్ మాసంలో చేసిన ఉపవాసాల్లో ఏవైనా పొరపాట్లు జరిగితే షవ్వాల్ మాసంలో చేసే ఈ ఆరు ఉపవాసాల ద్వారా అల్లాహ్ ఆ పొరపాట్లను మన్నిస్తాడనీ అంతిమ ప్రవక్త(స) తెలిపారు.

షవ్వాల్ నెలలో కూడా ఆరు ఉపవాసాలు ఉండే సద్బుద్ధిని అల్లాహ్ ప్రసాదించుగాక (ఆమీన్)

**తుదిగేటు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**